శుక్రవారం
30-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 248
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

సుప్రీం జడ్జిలుగా ముగ్గురి నియామకం

న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా ముగ్గురు హైకోర్టు జడ్జిలు గురువారం నియమితులయ్యారు. నియమితులైన వారిలో కర్నాటక హైకోర్టు సీజే ఎన్‌వీ అంజరియా, గువహటి హైకోర్టు సీజే విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు జడ్జి ఏఎస్ చందుర్కర్ ఉన్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ 'ఎక్స్'లో ప్రకటించారు. సీజేఐతో సంప్రదింపుల తర్వాత రాష్ట్రపతి ఈ ముగ్గురి నియామకాన్ని

- మిగతా 2 లో

తెలంగాణకు మూడు కీలక కేంద్ర సంస్థలు

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ క్రమంలో మూడు కీలకమైన ప్రపంచస్థాయి పరిశోధన సంస్థలను తెలంగాణకు మంజూరు చేసిందని తెలిపారు. అందులో భాగంగా గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సంస్థను కేటాయించిందని చెప్పారు. దీని వల్ల హైదరాబాద్ కేంద్రంగా ఐసీఏఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్‌లో జరుగుతున్న పరిశోధనలను మెరుగుపరచడం, తద్వారా ఆహార- పోషక

- మిగతా 2 లో

ఏపీలో కొత్తగా 71,380 పింఛన్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్పౌజ్ కేటగిరి కింద 71,380 మందికి కొత్తగా పింఛన్ల జారీకి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆదేశాలు జారీ చేసింది. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 2025 మే నెల నుంచి స్పౌజ్ కేటగిరి పెన్షన్ జారీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నెలకు రూ.4 వేల వంతున 71,380 మందికి కొత్తగా పెన్షన్ జారీకి సెర్ప్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 12న ఈ పెన్షన్‌లను లబ్ధిదారులకు అందించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. ఎన్‌డీఏ సర్కార్ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై రూ. 35 కోట్ల మేర అదనపు భారం పడనుంది.

ఇదీ లోకం!

కొట్టావులే దొరా.. కొంచెం నా కూడూ, గుడ్డా, పని , ధరల సంగతి చూడు మరి!

దేశ భద్రత ట్రంప్ వద్ద తాకట్టు

- యుద్ధం... మోదీ ప్రభుత్వ సొంత వ్యవహారం కాదు
- పాక్‌ను రెండు ముక్కలు చేసిన ధీశాలి ఇందిరాగాంధీ
- దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవశ్యం
- జైహింద్ యాత్రలో రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: పహల్గాం ఘటన తరువాత ఉగ్రవాదంపై ప్రారంభించిన యుద్ధం ఎందుకు ఆపాల్సి వచ్చిందనే విషయం నేటికి ఎవరికీ తెలియదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశం యవత్తు ప్రధాని మోదీకి మద్దతు ఇచ్చారని తెలిపారు. అఖిలపక్ష భేటీలో పార్టీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే కూడా చాలా స్పష్టంగా కేంద్రానికి మద్దతు పలికారని గుర్తు చేశారు. ఇలాంటి అంశాల్లో కాంగ్రెస్ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వదని స్పష్టం చేశారు. ఏఐసీసీ పిలుపుమేరకు గురువారం టీపీసీసీ

- మిగతా 2 లో

గద్దర్ అవార్డులు

ఉత్తమ చిత్రంగా కల్కి | **ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్**

- ఉత్తమ నటిగా నివేదా థామస్
- 14న అవార్డుల ప్రదానోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డులను జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ గురువారం ప్రకటించారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1,248 నామినేషన్లు రాగా వాటిని పరిశీలించిన అనంతరం అవార్డు గ్రహీతల పేర్లను ప్రకటించారు. ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గానూ అల్లు అర్జున్ ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రాలుగా కల్కితో పాటు మరో రెండు సినిమాలకు అవార్డులు లభించాయి. మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898ఏడీ , రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్, ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు, హిస్టరీ - హెరిటేజ్ చిత్రం: రజాకార్, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్, ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు), ఉత్తమ

- మిగతా 2 లో



నకిలీ విత్తనాలు అమ్మితే
కఠిన చర్యలు

- భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం
- రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- 3 నుంచి రెవెన్యూ సదస్సులు: భట్టి

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో జూన్ మూడవ తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లు, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, వ్యవసాయ శాఖ ముందస్తు సాగు వంటి వివిధ అంశాలపై గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్‌తో ఆయన సమీక్షించారు. భట్టి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి సహకారం తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం

- మిగతా 2 లో

'ట్రంప్ టారిఫ్'తో సంబంధం లేదు

కాల్పుల విరమణపై భారత్ వివరణ

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై భారత్ ఎట్టకేలకు స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందానికి, 'ట్రంప్ టారిఫ్'కు సంబంధం లేదని చెప్పుకొచ్చింది. 'టారిఫ్ అధికారం వల్లనే ఇటీవల భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ సాధించగలిగారు' అంటూ అమెరికా యంత్రాంగం కోర్టులో వాదించిన నేపథ్యంలో భారత్ ఈ వివరణ ఇచ్చింది. 'ఈ అంశంపై భారత వ్యతిరేకతను వ్యక్తం చేశాం. మే 7న ఆపరేషన్ సిందూర్ నుంచి మే 10న జరిగిన కాల్పుల విరమణ వరకు... సైనికపరమైన పరిణామాలపై భారత్-అమెరికా మాట్లాడుకున్నాయి. ఆ సమయంలో సుంకాల ప్రస్తావన ఎన్నడూ రాలేదు' అని విదేశాంగ శాఖ గురువారం మరోసారి స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై మే 9న ప్రధాని నరేంద్ర మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడారు. అగ్రరాజ్య విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మే 8, 10 తేదీల్లో భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపారు. మే 10న భారత జాతీయ

- మిగతా 2 లో

బంగాళాఖాతంలో వాయుగుండం

నేడు వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నైరుతి రుతుపవనాలకు వాయుగుండం తోడైంది. ఇప్పటికే విస్తరించిన రుతుపవనాలతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వీటికి తోడుగా ఇప్పుడు వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. పారాదీప్‌నకు తూర్పు ఈశాన్యంగా 190 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కోస్తాలో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఇంక తీరం వెంట కోస్తా జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది. మరోవైపు నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వారం రోజుల పాటు వివిధ ప్రదేశాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ

- మిగతా 2 లో

మావోయిస్టు కీలక నేత హిడ్మా అరెస్టు

విశాలాంధ్ర-చింతూరు: ఏవోబీలో మావోయిస్టు కీలక నేత కుంజం హిడ్మా(జూనియర్ హిడ్మా) అరెస్ట్ అయ్యాడు. కోరాపుట్‌లో హిడ్మాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఏకే 47తో పాటు పేలుడు పదార్థాలకు సంబంధించిన

- మిగతా 2 లో

ఎంఎస్‌పీ పెంపు బూటకం

- మోదీ సర్కారు రైతుల్ని అపహాస్యం చేసింది
- కార్పొరేట్ లాభాల్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఏఐకేఎస్ మండిపాటు
- గ్రామగ్రామాన ప్రభుత్వ జీఓ దగ్ధం చేయాలని రైతులకు పిలుపు

న్యూఢిల్లీ: రైతులంటే కేంద్ర ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యమో తాజాగా 14పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)లే నిదర్శనమని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఎంఎస్‌పీలో సగటున

- మిగతా 2 లో

ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతాం

- రూ.2 లక్షల పదవీవిరమణ ప్రయోజనం
- 'ఇందిరమ్మ అమృతం' ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: తొలి బడి అమ్మఒడి కాగా మలి బడి అంగన్వాడీ నిలయాలేనని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం ఆమె వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి రోడ్డు 0/600 వద్ద రూ.6.50 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. కూనంనేని నిధులకోసం చాలా కృషి చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆయన బహుముఖ అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రహదారుల సౌకర్యం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం క్లబ్‌లో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు. వేస్ట్ నుంచి బెస్ట్‌గా రూపొందించిన కళాకృతులను చూసి కళాకారులను అభినందించారు. ఆరోగ్య తెలంగాణ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

సీపీఐ పోరాట ఫలితమే గౌరవెల్లి ప్రాజెక్టు

చాడ వెంకటరెడ్డి

గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఐ నాయకుల బృందం

విశాలాంధ్ర - హుస్నాబాద్: సీపీఐ పోరాట ఫలితమే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టును గురువారం రైతులతో కలిసి సీపీఐ నాయకుల బృందం పరిశీలించింది. వెంకటరెడ్డి మాట్లాడుతూ మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వరద కాలువ జలసాధన పోరాట సమితి అధ్వర్యంలో నాడు సీపీఐ పాదయాత్రలు చేసి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను సాధించిందని గుర్తుచేశారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి... గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభించినా... గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు

- మిగతా 2 లో

గాజాలో ఆకలి కేకలు: గోదాములపై దాడులు

జెరుసలేం: ఇజ్రాయిల్ భీకర దాడులతో గాజా ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. భూతల, వైమానిక దాడులు రోజురోజుకూ తీవ్రతరం అవుతుండటంతో పలస్తీనియన్లు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. అదే సమయంలో తీవ్రమైన ఆహార సంక్షోభం గాజాలో నెలకొన్నది. అన్నపానీయాలతో పాటు నిత్యావసరాలు, అత్యవసరాలు లభించడంలేదు. దీంతో ఆకలి చావులు సైతం సంభవిస్తున్నాయి. క్షుద్బాధ తట్టుకోలేక అక్కడి ప్రజలు అంతర్జాతీయ సంస్థల గోదాములపె దాడులు చేస్తున్నారు. ఈ ఘటనల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. గాజా ప్రజలకు అందించే మానవతా సాయం కోసం ఇజ్రాయిల్ పరిమిత అనుమతులు ఇవ్వడంతో అక్కడ తీవ్రమైన సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. డీర్ అల్ బలాహ్‌లోని ఆహార పదార్థాల గోదాముపై ప్రజలు దాడి చేశారు. గోదుమ పిండి తదితర ఆహార పదార్థాల పెట్టెలు లూటీ చేశారు. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. ప్రజలకు అందే సాయాన్ని తక్షణమే పెంచాలని వారన్నారు. ఈ దాడులలో ఇద్దరు చనిపోగా, కొందరికి గాయాలయ్యాయని సమాచారం. అయితే బుధవారం ఐరాస సహా అంతర్జాతీయ సంస్థల నుంచి మానవతా సహాయానికి సంబంధించిన 121 ట్రక్కులు గాజాలోకి ప్రవేశించినట్లు ఇజ్రాయిల్ అధికారులు తెలిపారు. అయితే ఇది అక్కడి ప్రజల అవసరానికి చాలదని ఐరాస అధికారులు పేర్కొన్నారు.

అందించే సాయాన్ని హమాస్ మళ్లిస్తోందనే ఆరోపణలు రాగా, వాటిని ఐరాస మానవతా కార్యాలయం అధికారి జొనథన్ విటల్ ఖండించారు. ఇజ్రాయిల్‌లోని కరెమ్ షాలోమ్ సరిహద్దులు దాటే సమయంలో ఓ ముఠా వీటిని లూటీ చేస్తోందన్నారు.

ఆహార పంపిణీ కేంద్రం వద్ద ఇజ్రాయిల్ కాల్పులు

ఆహార పంపిణీ కేంద్రం వద్ద ఇజ్రాయిల్ సైనికులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు, మరో 48 మంది తీవ్రంగా గాయపడ్డారు. రఫాలో కొత్తగా ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎఫ్ పంపిణీ కేంద్రానికి ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వారిని చెదరగొట్టేందుకు ఇజ్రాయిల్ దళాలు కాల్పులకు తెగబడింది. ఈ ఘటనను ఐక్యరాజ్య సమితి ఖండించింది. అమెరికా మద్దతు గల గాజా హ్యూమనిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్‌ఎఫ్) వద్ద కాల్పులలో ఎక్కువ మంది గాయపడ్డారని ఐరాస మానవ హక్కుల కార్యాలయ అధిపతి అజిత్ సన్‌ఘే తెలిపారు. ఈ దృశ్యాలు హృదయ విదారకమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజాకు నిష్పక్షపాతంగా ఆహార పంపిణీ జరగాలన్నారు.

పాక్ అణు పరీక్షల వార్షికోత్సవ ర్యాలీలో ఉగ్రవాదులు

ఇస్లామాబాద్: అణు పరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ అధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. లాహోర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి, ఎల్‌ఈటీ సభ్యుడు సైఫుల్లా కసూరీ పాల్గొన్నాడు. పంజాబ్ అసెంబ్లీ ప్రావిన్షియల్ స్పీకర్ మాలిక్ అహ్మద్‌తో వేదికను పంచుకున్నాడు. కసూరీ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిగా నిందించడంతో తన పేరు ప్రపంచానికి తెలిసిందని వ్యాఖ్యానించాడు. దాదాపు 20 నిమిషాలు ప్రసంగించాడు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ దాడిలో మరణించిన ఉగ్రవాది ముదస్సిర్ అహ్మద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లో నిర్మాణాలు చేపడతానన్నాడు. లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది తల్హా సయీద్ కూడా భారతకు వ్యతిరేకంగా ప్రసంగించాడు. ఎల్‌ఈటీ రాజకీయ విభాగం పీఎంఎంఎల్ నిర్వహించే కార్యక్రమాల్లో ఇతను పాల్గొంటుంటాడు. లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ ప్రాంతాల్లో ఇటీవల భారత వ్యతిరేక ప్రచారాన్ని పీఎంఎంఎల్ నిర్వహించింది.

ఇరాన్‌పై దాడులు చేయెుద్దు

అణు చర్చలకు విఘాతం కలిగించవద్దు

నెతన్యాహుకు ట్రంప్ సూచన

వాషింగ్టన్: ఇరాన్‌పై దాడులు చేయెుద్దని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. నెతన్యాహుతో ఇటీవల ఫోన్‌లో మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని చర్చించినట్లు మీడియాతో మాట్లాడిన ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో అణు చర్చలకు అంతరాయం కలిగించేలా సైనిక చర్యలు ఉండరాదని సూచించినట్లు వెల్లడించారు. ఒక పరిష్కారానికి దగ్గరగా వస్తున్నా సమయంలో దాడులు చేయడం సరి కాదని నెతన్యాహుతో చెప్పినట్లు ట్రంప్ తెలిపారు. ఒక్క ఫోన్ కాల్‌తో మార్పు రావచ్చని అన్నారు. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోగలిగితే చాలా మంది ప్రాణాలు కాపాడవచ్చని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడికి ఇజ్రాయిల్ ప్రణాళికలను అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు పసిగట్టారన్న వార్తల క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇదిలావుంటే, ఇరాన్, అమెరికా బృందాల మధ్య ఇటీవల ఒమన్‌లో ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఫలవంతంగా సాగినట్లు అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ వెల్లడించారు. అణు ఒప్పందం జరగని పక్షంలో సైనిక చర్యలు తప్పవని ట్రంప్ హెచ్చరించడం విదితమే. ఇరాన్ అధినేత ఖమేనీ కూడా చర్చలు సజావుగా సాగినట్లు చెప్పారు. ప్రత్యర్థుల వైఖరి మారక పోతే ప్రత్యక్ష చర్చలకు అవకాశం ఉండదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ చెప్పడం విదితమే.

మావోయిస్టు కీలక నేత హిడ్మా అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని బైపర్‌గూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్‌గూడ గ్రామ సమీప అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీపద్ కశ్యప్, ఏసీపీ దివ్య ప్రసాద్ పరిదా నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో కుంజం హిడ్మా(జూనియర్ హిడ్మా) అనే కోరాపుట్ మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు ఏకే 47తో లొంగిపోయాడు. 35 రౌండ్లు గల మ్యాగజైన్, 27 ఎలక్ట్రిక్ డిటొనేటర్లు, నాన్ ఎలక్ట్రిక్ రిటైనేటర్లు 90, రెండు కేజీల గన్‌పౌడర్, మావోయిస్టు సాహిత్యం, వాకిటాకీ, రెండు స్టీల్ డబ్బాలు, రెండు రేడియోలు, నాలుగు టార్చ్‌లైట్లు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన హిడ్మాది ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉసుర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనగూడ గ్రామమని అధికారులు తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాయి. ఒకపక్క పెరుగుతున్న గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లతో ఎక్కువ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. మరోవైపు, మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషర్ కగార్ కొనసాగుతోంది, చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత ఆపరేషన్ కగార్ మరింత దూకుడుగా కొనసాగుతోంది. చత్తీస్‌గఢ్‌తో పాటు ఏవోబీ ప్రాంతం వైపు కూడా భద్రతా బలగాలు దృష్టిసారించారు. ముఖ్యంగా ఒడిశాలో కొన్ని ప్రాంతాల నుంచి భారీగా పేలుడు పదార్థాలు తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ వర్గాల సమాచారంలో పక్కా పథకం ప్రకారం హిడ్మాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చాలాకాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల వద్ద ఉన్న ఆయుధాలు పూర్తిస్థాయిలో అడుగంటాయి. ఈ క్రమంలో ఒడిశా నుంచి పెద్దసంఖ్యలో పేలుడు పదార్థాలను చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి రవాణా చేస్తున్న సమయంలోనే హిడ్మాను ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సీపీఐ పోరాట ఫలితమే గౌరవెల్లి ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

పాలించి దానిని పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులోని పెండింగ్ పనులతో పాటు కాలువలు పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. అన్నదాతల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని రైతులకు హామీ ఇచ్చారు.

పార్టీ బలోపేతానికి కంకణబద్ధులు కావాలి

వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లో చిరస్మరణీయంగా ఉందని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కంకణబద్దులు కావాలని చాడ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో ఏర్పాటు చేసిన అక్కన్నపేట మండల మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఐ నుంచి కొందరు ప్రముఖులు హుస్నాబాద్ గడ్డపై ఏడుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడం గొప్ప అంశమన్నారు. అనంతరం అక్కన్నపేట మండల కమిటీని ఏన్నుకున్నారు. కార్యదర్శిగా కొమ్ముల భాస్కర్, సహాయ కార్యదర్శిలుగా బొజ్జపురి రాజు, మిట్టపల్లి మొండయ్యతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు, 16 మంది మండల కౌన్సిల్ సభ్యులను ఏన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలిపారు. సీపీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, ఎడల వనేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్ధన్, నాయకులు మాచర్ల శ్రీను, గాంభీరపు మధు, బైరి శ్రీనివాస్, బిక్షపతి, కంది మోహన్ రెడ్డి, సహదేవ్, ఇంద్రసేనరెడ్డి, రమేష్, బొడిగే లక్ష్మి, తాళ్ల ప్రశాంత్, రాజేందర్ సంతోష్ వివిధ గ్రామశాఖల కార్యదర్శిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని ఎంపీ పోలిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటీడీఏ పీఓ రాహుల్ తో కలిసి మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కౌమార బాలికల్లో రక్తహీనత నివారించేందుకు ఇందిరమ్మ అమృతం పేరిట ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు జిల్లాల్లో 50,269 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. 14 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలకు మిల్లెట్స్ తో కూడిన చిక్కీల ప్యాకెట్లను నెలకు రెండుసార్లు అందించడం జరుగుతుందన్నారు. గతంలో లేనివిధంగా అంగన్వాడీ కేంద్రాలలో ఏక రూప దుస్తులను అందిస్తున్నామన్నారు. త్వరలోనే గర్భిణలకు బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్వాడీ టీచర్లకు పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలు అందించడానికి ఆమోదం తెలుపుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంతకం చేశారని తెలిపారు. రాబోయే కాలంలో ఆశ వర్కర్ల జీతాల పెంపు, శాశ్వత ఉద్యోగులను చేస్తామని హామీ ఇచ్చారు. మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లాకు మంజూరైన రూ. 74.64 లక్షల చెక్కును మంత్రి అందజేశారు. జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ పెంపు బూటకం

(మొదటిపేజీ తరువాయి)

6 నుంచి 7% స్వల్ప పెంపును ప్రకటించడం ద్వారా రైతులపై కనికరం లేకుండా వ్యవహరించిందని మండిపడింది. ఈ మేరకు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు క్షీరసాగర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వామినాథన్ ఫార్ములా ప్రకారం ఎంఎస్‌పీ సీ2+50% కోసం చట్టబద్ధత కల్పించడాన్ని మోదీ ప్రభుత్వం నిరాకరిస్తూనే ఉందని తెలిపారు. తాజాగా 14 ఖరీఫ్ పంటలకు ప్రకటించిన ఎంఎస్‌పీ రైతులను అపహాస్యం చేయడమేనన్నారు. రైతు ఆదాయాలను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ... కార్పొరేట్ లాభాలను రెట్టింపు చేయడంపై దృష్టి సారించిందని...దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందుల్లో నెట్టబడ్డారని వెల్లడించారు. ఫలితంగా 1,20,000 మందికి పైగా రైతు ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఉత్పత్తి వ్యయంపై 50% మార్జిన్ అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదన పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ రహస్య అజెండాల ద్వారా వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ)ను దిగజార్చిందని వారు మండిపడ్డారు. అమెరికన్ వ్యవసాయ వ్యాపార సంస్థలకు భారత వ్యవసాయాన్ని కట్టబెట్టాలనే క్రూరమైన ఉద్దేశంతో, బీజేపీ ప్రభుత్వం సీఏసీపీ ని అశాస్త్రీయ, తప్పుడు ఎంఎస్‌పీలను లను సిఫార్సు చేసేలా చేసిందని తెలిపారు. వాస్తవానికి సీఏసీపీ వాణిజ్యం కాకుండా వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తుంది. అయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా శాస్త్రీయ సమగ్రవ్యయ (సి2) పద్ధతిని తొక్కిపట్టారని విమర్శించారు. రాష్ట్రాల సిఫార్సులు పరిగణలోకి తీసుకోకపోవడం భారతదేశ సమాఖ్య భావనను ఉల్లంఘించడం, రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం హేతుబద్ధ వ్యవసాయ విధాన రూపకల్పనను నాశనం చేసిందని మండిపడ్డారు. చివరికి, బీజేపీ రైతులకు వ్యతిరేకంగా డేటాను తారుమారు చేయడానికి సీఏసీపీని దుర్వినియోగం చేస్తోంది. వ్యవసాయ దిగుమతి-ఎగుమతుల్లో కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూరుస్తోంది. పెరుగుతున్న దిగుమతుల వల్ల ఇప్పటికే కంది, సోయాబీన్, కాయధాన్యాలు, పత్తి, ఇతర పంటల ధరల తగ్గాయని వారు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణ పరిమితులను రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లా స్థాయి రుణ ప్రణాళికలు అమలు కాలేదని తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థలు రైతు వ్యతిరేక చర్యలను కొనసాగిస్తున్నాయని 40% మంది రైతులను సంస్థాగత ఫైనాన్స్ నుండి మినహాయించాయని తెలిపారు. గ్రామీణ బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ రైతులకందే రుణాలను మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధంగా బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం పంటలకు సి2+50% కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)దక్కేలా చట్టబద్ధత కల్పించాలని వారు పునరుద్ఘాటించారు.

ఏఐకేఎస్ డిమాండ్లు:

ఏఐకేఎస్ కేంద్రం ప్రభుత్వం ముందు మూడు కీలక డిమాండ్లు ఉంచింది. 1) పంటల ఎంఎస్‌పీని వెంటనే సి2+50% స్థాయిలకు పెంచాలి. 2) ఈ మేరకు రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చట్టం చేయడం ద్వారా చట్టబద్ధ ఎంఎస్‌పీ గ్యారెంటీలను అమల్లోకి తేవాలి. 3) రాష్ట్రాల భాగస్వామ్యం, రైతుసంఘాల ప్రాతినిధ్యంతో అర్థవంతమైన సీఏసీపీని పునర్నించాలి.

రైతులు వినాశనాన్ని ఎదుర్కొంటున్నారు:

నాసిరకం ఎంఎస్‌పీలు, తిరిగి రాని పెట్టుబడి వ్యయాల కారణంగా వ్యవసాయం నష్టదాయకమైన ఆర్థిక కార్యకలాపంగా మారింది. మనుగడ కోసం, రైతులు తమ ఆస్తులను అమ్ముకోవలసి వచ్చింది. బీజేపీ దశాబ్ద కాలం పాలనలో 2 కోట్లకు పైగా రైతులు తమ వ్యవసాయ భూములను కోల్పోయారు. వ్యవసాయాన్ని విడిచిపెట్టారని ఏఐకేఎస్ మండిపడింది.

ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఆదేశాలను తగలబెట్టడం ద్వారా ఈ అన్యాయాన్ని నిరసించాలని ఏఐకేఎస్ రాష్ట్రాల విభాగాలకు పిలుపునిచ్చింది. అలాగే జూలై 9న కేంద్ర కార్మిక సంఘాల నేతృత్వంలో జరిగే దేశవ్యాప్త సమ్మె, సత్యాగ్రహానికి పెద్ద ఎత్తున రైతుల్ని సమీకరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ,అనుబంధ సంస్థలకు పిలుపునిచ్చింది. ఇక ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక , కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఐకేఎస్ విజ్ఞప్తి చేసింది.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు పూర్తి చేశామని చెప్పారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. అన్నారు. రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని సూచించారు. భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు వివరించాలని అన్నారు. మంత్రి కోమటి రెడ్డి మాట్లాడుతూ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎరువుల, విత్తనాల కొరత రాకుండా జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందని అన్నారు. ప్రతి మండలంలో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పొంగులేటి మాట్లాడుతూ... అసైన్డ్ భూముల్లో పోజిషన్ లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వీటికి సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. హైకోర్టు నుంచి స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామాలను పరిష్కరిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. నీటి పారుదల శాఖ పెండింగ్ పనులు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అన్నారు. రామ సహాయం మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని కోరారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో యాసంగి సీజన్ లో లక్షా 21 వేల మెట్రిక్‌టన్నుల సన్న రకం ధాన్యం, 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి బోనస్ తో సహా రైతులకు చెల్లించామన్నారు. భూ సమస్యలపై నేలకొండపల్లి మండలం నుంచి 3,224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1,791 సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులకు పట్టాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలపై పటిష్టమైన విజిలెన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ సామాగ్రి తక్కువ ధరకు పేదలకు అందించాలని, జిల్లాలో కొన్ని చోట్ల రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో ధాన్యం కోత విధిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు సజావుగా జరిగిందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంతంలో వైద్యుల కొరత ఉన్నదని, 100 పడకల ఆసుపత్రికి అనుగుణంగా వైద్యులను కేటాయించాలని కోరారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్‌లు పి. శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, డీఆర్వో ఎ. పద్మశ్రీ పాల్గొన్నారు.

గద్దర్ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి), ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2), ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం), ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్), ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్), ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్), ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (నిజమే నే చెబుతున్నా - ఊరి పేరు భైరవకోన), ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (సూసేకి అగ్గిరవ్వ - పుష్ప 2), ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2), ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్), ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి), ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి), ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్), ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి), ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (ఆయుధ పూజ - దేవర), ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అద్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ), ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్), ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ).

స్పెషల్ జ్యూరీ అవార్డులు...

నటుడు: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), నటి: అనన్య నాగళ్ల (పొట్టేల్), దర్శకులు: సుజీత్, సందీప్ (క), నిర్మాతలు: ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్), స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2), తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్), 14 ఏళ్ల తర్వాత ఈ అవార్డులను ప్రకటించారు. మొత్తం 11 కేటగిరీల్లో వీటిని వెల్లడించారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబరు 31 వరకు ఏడాదికి ఒక ఉత్తమ చిత్రానికి, 2014 నుంచి 2023 వరకు సెన్సార్ అయిన చిత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. 2024కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ అవార్డులు ఇచ్చారు. తెలుగు చిత్రాలతోపాటు ఉర్దూ చిత్రాలకూ అవార్డుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు సహా మొత్తం 21 మందికి వ్యక్తిగత అవార్డులు ఇచ్చారు. జూన్ 14న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

అభిమానులకు అంకితం: అల్లు అర్జున్

తెలంగాణ ప్రభుత్వం తనకు ప్రకటించిన ప్రతిష్ఠాత్మక గద్దర్ అవార్డును అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ఉత్తమ నటుడిగా ఎంపికైన అల్లు అర్జున్ ప్రకటించారు. ఉత్తమ నటుడిగా ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కీర్తి అంతా సుకుమార్, నిర్మాతలదే అని, అభిమానులు చూపించే ప్రేమ, మద్దతు నాలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయన్నారు.

దేశ భద్రత ట్రంప్ వద్ద తాకట్టు

(మొదటిపేజీ తరువాయి)

అధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి జైహింద్ యాత్ర ప్రారంభించారు. సీఎంతో పాటు పార్టీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరయ్యారు. నిజాంపేట కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు. మీ అభిమానం, మీ శ్రమ ఫలితమే నేడు తాను తెలంగాణ్ణ ముఖ్యమంత్రిగా నిలబడ్డానని చెప్పారు. పహల్గాంలో భారతీయుల గుండెల్లో తూటాలు దించిన ఒక్కరు కూడా ప్రాణాలతో ఉండొద్దని ఆనాడు నెక్లెస్ రోడ్ వేదికగా నినదించామని గుర్తు చేశారు. ప్రపంచ పటంలో పాకిస్థాన్ కనిపించొద్దని, ఇందుకు ప్రధానికి మనమంతా మద్దతుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశామన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ లో కలుపుకునేందుకు పాక్ పై యుద్ధం చేయాలని, రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని స్పష్టం చేశామని వివరించారు. కానీ నాలుగు రోజుల యుద్ధం తరువాత ఏం జరిగిందో తెలియదుగానీ... అర్ధాంతరంగా మోదీ ప్రభుత్వం యుద్ధాన్ని ముగించిందన్నారు. యుద్ధ విరమణ ముందు అఖిలపక్షం అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని, గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధ తంత్రాన్ని నడిపించగలడన్నారు. ఆనాడు చైనాపై యుద్ధం ప్రకటించి ఆ దేశానికి గట్టిగా బుద్ధి చెప్పిన ఘనత ఇందిరమ్మదన్నారు. మన ఆర్మీ జవాన్ కల్నల్ సంతోశ్‌ను చైనా పొట్టన పెట్టుకుంటే మోదీ కనీసం చైనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం చేయలేదన్నారు. 1971 లో భారత్- పాక్ యుద్ధ సమయంలో అమెరికా మధ్యవర్తిత్వం అవసరం లేదని నిర్మొహమాటంగా చెప్పిన ధీశాలి ఇందిరమ్మ అని కొనియాడారు. ఆనాటి యుద్ధంలో ఇందిరమ్మ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసి చూపారని, ఇందిరమ్మ స్ఫూర్తితో పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయాలని... ఇందుకు మద్దతుగా ఉంటామని తాను ప్రకటించానని గుర్తు చేశారు. దేశ ప్రజలు వీరతిలకం దిద్ది యుద్ధం చేయమంటే ట్రంప్ చెప్పాడని మోదీ యుద్ధం విరమించడం సరికాదన్నారు. దేనికోసం బీజేపీ నేతలు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. యుద్ధం మీ సొంత వ్యవహారం కాదు దేశ భద్రత అంశం అని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశ భద్రతను ట్రంప్ దగ్గర తాకట్టు పెట్టారని మండిపడ్డారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని బీజేపీ దెబ్బతీస్తే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కాంగ్రెస్ జైహింద్ యాత్ర చేపట్టిందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, గాంధీ కుటుంబానిదన్నారు. మోదీ కాలం చెల్లిన నాణెం వంటి వారని, దేశానికి రాహుల్ గాంధీ వంటి నాయకుడు కావాలన్నారు.

తెలంగాణకు మూడు కీలక కేంద్ర సంస్థలు

(మొదటిపేజీ తరువాయి)

భద్రతలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను ప్రచారం చేయడం, తెలంగాణ రైతులకు మిల్లెట్ల సాగులో శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. అలాగే కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థ ద్వారా సికింద్రాబాద్ కేంద్రంగా దేశ రైల్వే భద్రత కోసం స్వదేశీ సాంకేతికత "కవచ్"ను అభివృద్ధి చేయడం దీని ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లను(ఐటీఐ) ఆధునీకరించి, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ, వృత్తి విద్యను తెలంగాణ యువతకు అందించడం దీని ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతు ఇవ్వడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహద పడనున్నట్లు వివరించారు.

'ట్రంప్ టారిఫ్'తో సంబంధం లేదు

(మొదటిపేజీ తరువాయి)

భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోనూ మాట్లాడారు. 'ఏ సందర్భంలోనూ రెండుదేశాల మధ్య వాణిజ్య అంశం ప్రస్తావనకు రాలేదు. కాల్పుల విరమణకు, వాణిజ్యానికి సంబంధం లేదు' అని కొన్ని రోజుల క్రితమే భారత్ తెలిపింది. అంతకుముందు కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన చేసినా భారత్ మాత్రం ట్రంప్ పాత్రను ప్రస్తావించలేదు.

బంగాళాఖాతంలో వాయుగుండం

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ్ తెలిపారు. కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సుమారు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

సుప్రీం జడ్జిలుగా ముగ్గురి నియామకం

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదించినట్లు వెల్లడించారు. మాజీ సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ రిషికేశ్ రాయ్ పదవీ కాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ ముగ్గురి పేర్లను కొలీజియం సోమవారం సిఫార్సు చేసింది.

భవిత కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : భవిత కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నాంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో చేపట్టిన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భవిత కేంద్రాలలో కల్పించాల్సిన మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా ర్యాంపు, టాయిలెట్స్, ఆక్టివిటీ రూము, ఇతర అన్ని సౌకర్యాలు భవిత కేంద్రంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంఈఓతో పాటు, ఇంజనీరింగ్ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి వహించి పూర్తిచేయాలని అన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, ఇన్చార్జ్ ఆర్డిఓ రమణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ వెంకన్న, ఆర్ఐ విజయ, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

వర్గ పోరాటాలను ఉధృతం చేయాలి

విశాలాంధ్ర-మరిపెడ: కమ్యూనిస్టు కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని వారి కోసమే జీవించాలని, పాలకవర్గాలు ప్రజా వ్యతిరేక విధానాలను వారు చేస్తున్న తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ నిలదీస్తూ వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న గురువారం ఐదవ రోజు జిల్లా స్థాయి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కమ్యూనిస్టు పోరాటం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వారికి మేము ఉన్నామని ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలి. అనంతరం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆశ చూపెడుతూ లబ్దిదారులను గందర గోళానికి గురి చేస్తున్నాయన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు రాకుండా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వకపోతే ప్రభుత్వ భూములు పేదల గుడిసెలు వేసి సిపిఐ (ఎం) పార్టీ ఇండ్లు నిర్మిస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు సూర్నపు సోమయ్య గునుగంటి రాజన్న, ఆకుల రాజు, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి మధుసూదన్, రాజన్న, లచ్చయ్య, రాజశేఖర్, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర- తొర్రూర్ : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తొర్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో టిపిటిఎఫ్ భవన్ వద్ద ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిపిటిఎఫ్ పతాకాన్నీ పి.వినోద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని, విద్యా సంస్థలు అన్నింటిని ప్రభుత్వమే నిర్వహించాలని, డబ్బు వారి పిల్లలైనా, లేని వారి పిల్లలైన ఒకే పాఠశాలలో చదివే విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఉద్యమాలకు తల్లి లాంటిదని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, మన భవిష్యత్తు ప్రభుత్వ విద్యారంగా కాపాడుకోవడం కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తుందని తెలియజేశారు. అనంతరం కొలుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, 2023 నుండి రావాల్సిన పిఆర్సిని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డిఏలను మంజూరు చేయాలని కోరారు. విద్యా రంగ అభివృద్ధి కోసం ఖాళీలుగా ఉన్న ఎంఈఓ, జిల్లా ఉప విద్యాధికారి, జిల్లా విద్యాధికారి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తండ ప్రభాకర్, వీరన్న, సంపత్, బాలు, కృష్ణ, యాకన్న, ఈ శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో 20 వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు పాల గణపతి శర్మ, సదాశివశర్మ, దేరం జయప్రకాష్ శర్మ, స్వామివార్లకు అలంకరణ, అభిషేకాలు, హోమాలు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో ఘనంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, కమిటీ సభ్యులు మైల బుచ్చిరెడ్డి, ఉట్కూరు వేమన్ రెడ్డి, ఏషాల ఆంజనేయులు, బొడిగె శంకర్ గౌడ్, చెట్లపల్లి శ్రీనివాస్ బూడిద వెంకటయ్య, బుచ్చి రాములు, పాల్గొన్నారు.

నర్సరీల్లో తనిఖీలు నిర్వహించిన జిల్లా జడ్పీ సీఈఓ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం సోమవరం, బూర్గులతండా, బోడలదిన్నె గ్రామ పంచాయతీలలోని నర్సరీలను గురువారం జిల్లా జడ్పీ సీఈవో వి.వి.అప్పారావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో మొక్కల పెంపకాలపై దృష్టి సాధించి, ఎప్పటికప్పుడు మొక్కలను పరిశీలించుకోవాలన్నారు. నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు సలహాలు సూచనలు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, సెర్ప్, మండల పరిషత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి, మండల పరిషత్ సూపరిడెంట్, ఏపీవో, ఏపీఎం, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు రమేష్, స్వరూప, పద్మ ఫీల్డ్ అసిస్టెంట్లు సుజాత, రజిత శోభన్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు, బ్రిడ్జిల నిర్మాణాలతోనే

మారుమూల ప్రాంతాల అభివృద్ధి

మంత్రి సీతక్క

దశాబ్దాల నాటి ప్రజల కష్టాలకు పరిష్కారం : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మారుమూల ప్రాంతాల అభివృద్ధి రహదారులు, బ్రిడ్జిల నిర్మాణాలతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం పాత పాల్వంచ నుండి పెనుబల్లి రోడ్డు 0/600 వద్ద రూ. ఆరున్నర కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో హైవేలు, స్కై వేలు, ఫ్లై వేలు అన్ని వచ్చినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో ఇప్పటివరకు వన్ వేలు కూడా రాలేదన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి గూడెం, తండాకు, గ్రామాలకు పంచాయతీలకు మండలాలకు రోడ్డు కనెక్టివిటీ ఉండే విధంగా రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కూనంనేని మాట్లాడుతూ దశాబ్దాల నాటి పెనుబల్లి గ్రామ ప్రజల ఇబ్బందులకు బ్రిడ్జి నిర్మాణంతో పరిష్కారం దొరికినట్టైందన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా బ్రిడ్జి నిర్మాణంలో మార్పు చేసి అవసరమైతే ఇంకా ఎక్కువ నిధులు కేటాయిస్తామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రహదారులతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. తమ నియోజకవర్గంలో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని వాటి కోసం సహకరించాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, కమిషనర్ సుజాత, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడి యాక్ట్ నమోదు చేస్తాం

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్/ తొర్రూర్: రైతులకు నకిలీ విత్తనాల అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి డి రామ నరసయ్య తొర్రూర్ ఎస్సై ఉపేందర్‌లు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొర్రూర్ మండలంలోని మన గ్రోమోర్, పద్మావతి ఫర్టిలైజర్, పెస్టిసైడ్ సీడ్ దుకాణాలలో వారు తనిఖీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే సంబంధిత వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, గుడ్డ సంచులలో విత్తనాలను అమ్మ రాదని, విత్తనం అమ్మిన ప్రతి రైతుకి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని వారన్నారు. అలాగే రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలని, విత్తనాలు తీసుకున్నప్పుడు బిల్ తప్పనిసరిగా తీసుకొని ఆ బిల్ పంట కాల ముగిసే వరకు భద్రపరుచుకోవాలని తెలిపారు. అనుమతి లేని వ్యక్తుల వద్ద విత్తనాలు తీసుకోకూడదని అన్నారు. స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్కులు తప్పనిసరిగా నమోదు చేస్తూ రైతులకు గడువు ముగిసిన విత్తనాలు అమ్మిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విత్తన షాపుల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను రైతులు కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - గూడూరు: మండల కేంద్రంలో అకాల వర్షాలతో రైతులు ప్రజలు అతలాకుతలం అవతుడడంతో రైతుల ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. పంట పొలాలకు కావలసిన ఎరువులను మందులను నాసిరకం కాకుండా మంచివీ కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని సరైన సమయంలో అమ్మకాలు సెంటర్‌లో కొనుగోలు చేస్తే సరైన రీతిలో రైతుల నుండి కొనుగోలు చేయొచ్చని ఎడతెరిపి లేకుండా అకాల వర్షానికి కురిసిన వర్షాలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేశారు. అధికారులు నాణ్యమైన రకాలను మాత్రమే ఎంచుకోవాలని రైతుల రషీద్ పొందాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ కోరారు. గ్రామాలలో తిరుగుతున్నటువంటి కొంతమంది వ్యక్తులు విత్తనాల అమ్మకాల్లో నాణ్యమైన సరుకును అమ్మక పోవడం ద్వారా రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని బిటి త్రీ విత్తనం ద్వారా ప్రజలు అప్రమత్తగా ఉండాలనిఅబ్దుల్ మాలిక్ పిలుపునిచ్చారు.

భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : భూ సర్వేల నిర్వహణలో సర్వేయర్లది ముఖ్యమైన పాత్ర అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు కలెక్టరేట్‌లోని తన చాంబర్లో సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ చట్టాన్ని అనుసరించి భూ సమస్యలను సర్వేయర్లు పరిష్కరించాలి అన్నారు. శిక్షణ కాలంలో అధికారుల నుంచి అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకొని క్షేత్రస్థాయిలో భూ సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాగా జిల్లాలో 113 మంది లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండు పూటలా శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వేయర్ సుదర్శన్, లైసెన్స్ సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : గత ఎంతో కాలం నుండి కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతానికే పనిచేస్తున్న కార్మికులను వెంటనే శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలని టియుసిఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం సింగరేణి మండల పరిధిలోని మాదారం స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులతో పాటు పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన వేతనం ఇవ్వకుండా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం శ్రమ దోపిడీ చేసి పబ్బం గడుపుకుంటుందని ఆరోపించారు. మాదారం స్టీల్ ప్లాంట్‌లో ప్రతి సంవత్సరం నష్టాల పేరిట కాంటాక్ట్ కార్మికులను తొలగించాలనే ఉద్దేశాన్ని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విరమించుకోవాలని కోరారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 3,000 మందిని కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి కనీసం బెనిఫిట్స్ కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఈ సంవత్సరం 2600 మంది కాంటాక్ట్ కార్మికులను తొలగించాలని యాజమాన్యం కుట్ర చేస్తుందని ఈ కుట్రలను కార్మిక వర్గం ఎదిరించాలన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కాంట్రాక్ట్ కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీ మధ్యాహ్న భోజనం ఆశ అంగనవాడి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టియుసిఐ కారేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు,ఎస్ కే ఖైరుద్దీన్ వీరు,ఇబ్రహీం,హుస్సేన్,రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ ఏడాది నాలుగు రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలో గతేడాది యాసంగి కొనుగోలు కంటే ఈ ఏడాది నాలుగు రెట్లు అధికంగా పంట కేంద్రాలకు వచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడించారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మేనేజర్ గురువారం ఆ శాఖ నుంచి ధాన్యం వివరాలు తెలిపారు. 2024-25 సీజన్లో మొత్తం 144 దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 50853.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 7517 రైతుల నుండి కొనుగోలు చేసామన్నారు. దాని విలువ రూ.117.68 కోట్ల ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుత ఈ సీజన్లో ఇప్పటివరకు 5789 మంది రైతుల నుండి 46328, 370 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని సేకరించి రూ.107.18 కోట్లను రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. గత యాసంగి సీజన్ కంటే ఈ సీజన్లో నాలుగు రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిందన్నారు. కేంద్రాల నిర్వాహకులు నిబంధనల మేరకు దాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అవసరమైన టార్పాలిన్స్, తూకం యంత్రలు, తేమ మీటర్లను తగు మొత్తంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయబడుతుందన్నారు.

రాజీవ్ యువ వికాసం రుణాలపై సందేహాలు...!

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా, గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేసిన రాజీవ్ యువ వికాసం సబ్సిడీ రుణాల పథకంపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ రుణాలను అందించాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీంతో జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి లబ్దిదారుల ఎంపికపై మండలాల అధికారులతో పాటు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ కల్లా లబ్దిదారుల ఎంపికలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గత వారమే ఆదేశాలు జారీ చేసారు. ఈ రుణాల ఎంపిక ప్రక్రియ యావత్తు ఎమ్మెల్యేల కనుసనల్లోనే జరగాలని ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. దీంతో రుణ లబ్దిదారుల ఎంపికపై రాజకీయ ప్రమేయమే ఆధారపడి ఉండటంతో విమర్శలు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కోసం లక్ష దరఖాస్తుల పైనే వచ్చినట్లు సమాచారం. రూ. 50 వేలు ఉచితం కాగా లక్ష రుణానికి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అందుకే జూన్ 2న పెద్ద రుణాలను పక్కన పెట్టి చిన్న రుణాల లబ్దిదారులను ఎంపిక చెయ్యని పైనుంచి ఆదేశాలున్నాయి. కానీ ఈ రుణాలకు లబ్దిదారుల సంఖ్య చాలా తక్కువ ఉంది. జులైలో నెలలో రూ. 2 నుంచి 4 లక్షలున్న యూనిట్లను కుదించి ప్రక్షాళన చేస్తారని తెలుస్తుంది. పైగా సిబిల్ల స్కోర్‌తో లబ్దిదారులకు సంబంధం లేదని ప్రభుత్వం చెప్పినప్పటికీ బ్యాంకర్లు మాత్రం సిబిల్ స్కోర్ తక్కువ వున్న వారిని పక్కన పెడుతున్నట్లు సమాచారం. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం తరహాలో ఈ సబ్సిడీ రుణాలను కూడా తూతు మంత్రంగా ఇచ్చి చేతులు దులుపు కోవాలని చూస్తున్నట్లుంది ఇప్పటికే విమర్శలు మొదలయ్యాయి.

ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు హర్షణీయం

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ / తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని మంజూరు చేయడం హర్షనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్‌లు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి లా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బిడ్డలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలని సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తుందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, ఝాన్సీ రెడ్డిలు 18 నెలల కాలంలోనే వందల కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఏఎంసి డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేకల కుమార్,చెవిటి సధాకర్, పింగిలి ఉష,బూర్గుల ప్రశాంతి, బిక్షం గౌడ్,దొంగరి శంకర్,నల్లపు రాజు, వెన్నెం సోమిరెడ్డి, సహదేవ్,ఇమ్మడి శ్రీనివాస్, రాజేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, రమేష్ నాయక్, మహేష్ యాదవ్, బానోత్ సాగర్, గిరిధర్, వెలుగు మహేశ్వరి, తాటికాయల రాణి, అనిత, నల్ల మాస మహేష్, చిదిరాల రవి, వెంకటయ్య, అభిరామ్, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. నెలవారి సమీక్షలో భాగంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో ఆయన కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిసిపిలు, ఏసిపిలు, కరుణాకర్, సి.రాజు, మల్లారెడ్డి, ఎం.రమేష్, ఆర్ ప్రకాష్, జి.కృష్ణ,వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్, సిఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేతను విరమించుకోవాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కి వినతి

విశాలాంధ్ర - ఖమ్మం : రాష్ట్రవ్యాప్తంగా 12 ఎస్సీ గురుకులాలలో జూనియర్ కాలేజీల మూసివేత నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసహరించు కోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్, డిమాండ్ చేశారు. ఖమ్మం. సమకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజే శారు. 12 గురుకులలో ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలని నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూసుమంచి బాలికలు, సత్తుపల్లి బాలురు భద్రాచలం బాలికలు, ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులు లేరని సాకుతో కళాశాల మూసివేత నిర్ణయం తగదు అని అన్నారు, కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఇంటర్ చదువుతున్న పేద మధ్యతరగతి వెనకబడిన వర్గాల విద్యార్థులకు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలిచాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 గురుకులాలు పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలను ఎత్తివేయాలని ఆలోచన విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలతో పాటు కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపి త్రినాథ్ ఉదయ్ అజయ్ ప్రతాప్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : 2026 లో జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులకు ముంబైలోని హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు. హజ్ హౌస్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ ద్వారా ముంబైలో ఇస్తున్న శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ పొందేందుకు గాను ఆ సంస్థ జులై 13 న హైదరాబాద్‌లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మెరిట్ సాధించిన వారికి ఒక సంవత్సరం పాటు ఉచిత శిక్షణతో భోజన, వసతి సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను జూన్ 21లోపు www.hajcommittee.gov.in వెబ్‌సైట్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ముస్లింలతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు సద్వినియోగం చేసుకోవాలని యాకుబ్ కోరారు. ఇతర వివరాలకు 8520860785 సెల్ నంబర్ కు సంప్రదించాలని ఆయన కోరారు.

కొత్తగూడెం ఏరియాలో పర్యటించిన చీఫ్ లైసన్ ఆఫీసర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సంస్థ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్టి కమిటీ చీఫ్ లైసన్ ఆఫీసర్ వి.కృష్ణయ్య గురువారం పర్యటించారు. రోస్టర్ పాయింట్ వెరిఫికేషన్ కోసం జీఎం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కృష్ణయ్యతోపాటు వైస్ ప్రెసిడెంట్ అండ్ కార్పొరేట్ జీఎం ఎం. తిరుమల్ రావు కూడా పర్యటనలో వున్నారు. కొత్తగూడెం ఏరియా ఎస్టి ఉద్యోగులకు పదోన్నతుల కు సంబంచించిన రోస్టర్ పాయింట్ రిజిస్టర్ లను తనిఖీ చేసారు. రోస్టర్ రూల్ ప్రకారం పదోన్నతులు జరుగుతున్నాయో లేదో సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం వారు రోస్టర్ రిజిస్టర్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియా డిజిఎం శివ కేశవరావు కావలసిన అన్నీ వివరాలను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బి.నాగేశ్వరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ జీఎం తిరుమల్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పంతుల, డిజిఎం యోహన్, ఎస్టేట్ ఆఫీసర్ బి. తౌర్య, పర్సనల్ ఆఫీసర్ సంఘమిత్ర, రామదాసు, అజ్మీర శ్రీనివాస్, హీరాలాల్, డి. కిశోర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బతికుండి సమస్యలపై పోరాడాలి

విశాలాంధ్ర - ఇల్లందు : సమస్యలకు పరిష్కారం ఆత్మహత్యలు కాదని బ్రతికి ఉండి సమస్యలపై పోరాడుతూ సాధించుకోవాలని సిపిఐ ఎం-ఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇల్లెందు మండల పరిధిలోని ఏడిప్పలగూడెంలో ఇటీవల మరణించిన ఏఎస్ఎం చింత సావిత్రి సంతాప సభలో వారు పాల్గొని మాట్లాడారు. అనేక ప్రజా సమస్యలను న్యూడెమొక్రసీ పరిష్కరించిందని ఉదంతాలు గుర్తు చేసారు. చింత సావిత్రికి జోహార్లర్పిస్తూ, సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సామాజిక సమస్యల అధికమించేందుకు యువతరం ముందుకు రావాలని కోరారు. సమాజం కోసం పాటుపడిన త్యాగదనుల చరిత్ర చదవాల్సిన అవసరం ఉందన్నారు. మండల నాయకులు చింత నరసింహరావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాపసభలో మండల కార్యదర్శి పొడుగు నరసింహారావు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, ట్రైబల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సూరపాక నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ చింత రజిత, పూణెం కోటయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

సంపాదకీయం

ఎన్‌టీఆర్ ఆశయాలకు పునరంకితమయ్యేనా?

మూడు రోజులపాటు కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు దిగ్విజయంగా ముగిసింది. టీడీపీకి ప్రధాన ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అడ్డా అయిన కడప నడిబొడ్డున ఈ మహానాడు నిర్వహించడం వెనుక ఉద్దేశం అందరికీ ఎరుకే. గత ఏడాది మరోసారి అధికారంలోకి వచ్చిన టీడీపీ విజయగర్వాన్ని మీసాలు మెలేసి తిప్పి మరీ ప్రదర్శించడమే దీని పరమోద్దేశం కావచ్చు. ఆరు శాసనాలు, పదహారు తీర్మానాలతో ప్రతినిధుల సభను ముగించారు. మూడోరోజు భారీ బహిరంగసభను నిర్వహించి, నలభై ఏళ్ల క్రితమే చరిత్రను తిరిగరాసిన తెలుగుదేశం పార్టీకి మరో నలభయ్యేళ్లపాటు తిరుగులేదని అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన 'డిక్లరేషన్'తో పసుపుపండగకు తెరపడింది. తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహాన్ని ఈ మహానాడు ఇనుమడింపజేసింది. టీడీపీ అధికారంలో ఉన్నందున కార్యక్రమం కనువిందుగా సాగింది. అధికారవర్గాలు పరోక్షంగా, అనధికారవర్గాలు ప్రత్యక్షంగా తలోచెయ్యివేసి సభలను అద్వితీయంగా రంజింపజేశాయి. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు, కుప్పం నుంచి మడకశిర వరకు- రాష్ట్రం నలుమూలల నుంచి పరుగుపరుగున కడపగడ్డకు చేరుకున్న పచ్చజెండాలు రొమ్మువిరిచి, నిండైన ఆత్మవిశ్వాసంతో రెపరెపలాడాయి. ఐదేళ్ల హామీని ఇంపుగా, వినసొంపుగా నింపుకున్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 ఏళ్లే కావచ్చు. కానీ ఆ నాలుగు దశాబ్దాల చరిత్ర గొప్పదే. ఓ కథానాయకుడిని మహానాయకునిగా మార్చిన చరిత్ర టీడీపీది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను ఐదు దశాబ్దాలపాటు ఏలిన నటుడు నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) 1982 మార్చి 29వ తేదీన ఏర్పాటు చేసిన తెలుగుదేశంపార్టీ ఒక్క ఏడాదిలోనే అధికారాన్ని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. కాంగ్రెస్ వ్యతిరేక ఎజెండాతో సామాన్య జన సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పుట్టిన టీడీపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను, ప్రజల స్థితిగతులను మార్చివేసింది. అయితే పడిలేచిన కెరటాల మాదిరిగా ఆ పార్టీ అంతర్గతంగానూ, బహిర్గతంగానూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఆటుపోట్లు, వెన్నుపోట్లు ఈ పార్టీలో అంతర్లీనం, అత్యంత సహజం. అయినప్పటికీ, దాదాపు 22 సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగి, తన ఉనికిని చాటుకున్నది. టీడీపీ సృష్టికర్త ఎన్‌టీఆర్ ఏకంగా 7 సంవత్సరాల 195 రోజులపాటు ముఖ్యమంత్రిగా ఉండగా, చంద్రబాబునాయుడు దాదాపు 15 సంవత్సరాలపాటు (ఇప్పటివరకు) సీఎంగా పనిచేశారు. తెలుగు ప్రాంతీయం, లౌకికవాదం, ప్రజాభిప్రాయం, సమాఖ్యవాదం అనేవి తెలుగుదేశం పార్టీ భావజాలంలో భాగంగా ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఆర్థిక, నయా ఉదారవాదాలను, సనాతన ధర్మాలను సైతం అక్కున చేర్చుకొని పయనం సాగిస్తున్నది. తెలుగుభాషను, తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని విశ్వ యవనికపై ఢంకా భజాయించి చాటిచెప్పడమే లక్ష్యంగా, రైతులు, మహిళలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎన్‌టీఆర్ టీడీపీని తీర్చిదిద్దారు. 1977 నాటి దివిసీమ ఉప్పెన ప్రభావం ఎన్‌టీఆర్ మనసులో బలంగా నాటుకుంది. అదే మరో ఐదేళ్లలో టీడీపీ అవతరించడానికి దారితీసింది. ఆ ప్రభావంతోనే ఎన్‌టీఆర్ టీడీపీ ఎన్నికల ప్రణాళికలో ప్రజల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చారు. 2 రూపాయలకే కిలో బియ్యంతో ఆహారభద్రత, సహకార సంఘాలు, మహిళలకు రాజకీయ, ఆర్థిక సాధికారిత, గృహనిర్మాణం, ఎంసెట్ వంటి విద్యాసంస్కరణలు టీడీపీని మహోన్నతస్థాయికి చేర్చాయి. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత 'కాలనుగుణ్యత' పేరుతో కొన్ని మార్పులు చేసుకుంటూ వచ్చారు. కాంగ్రెస్, బీజేపీయేతర తృతీయ ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల ఏర్పాటులో టీడీపీ పాత్ర అమోఘం, శ్లాఘనీయం. ఆ తర్వాతి కాలంలో బీజేపీ తొత్తుగా మారి, స్వార్థపర రాజకీయాలతో తెలుగుదేశం పార్టీ మౌలిక భావజాలానికి తూట్లుపొడిచిన సందర్భాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఆ పార్టీ పాత్ర మాత్రం తిరుగులేనిదని చెప్పవచ్చు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 2014లో నవ్యాంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కొన్ని వర్గాలను విస్మరించిన పాపాన 2019లో అధికారాన్ని కోల్పోయింది. నవరత్నాల హామీలతో జగన్ నేతృత్వంలోని వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు ఏపీని పాలించింది. కాకపోతే కనీవినీ ఎరుగనిరీతిలో రాష్ట్రం రాక్షసపాలనను చవిచూసింది. ఆ పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా జనసేన పార్టీతో కలిసి టీడీపీ విజయబావుటా ఎగురవేసింది. ఇంకొన్ని లాభాలు దృష్టిలో పెట్టుకొని బీజేపీని కూడా చంకనపెట్టుకోవాల్సి వచ్చింది. లౌకికవాదం వంటి అంశాల విషయంలో తెలుగుదేశం పార్టీ మౌలిక సూత్రాలకు ముప్పువాటిల్లినప్పటికీ, అధికారం కోసం అనివార్య పరిస్థితులను అడ్డంపెట్టుకోవాల్సివచ్చింది. ఆ విధంగా కూటమి పాలనకు అటుఇటుగా సంవత్సరం పూర్తి కావొస్తుంది. ఈ నేపథ్యంలో జరిగిన టీడీపీ మహానాడు సహజంగానే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ఆరు గ్యారంటీల (సూపర్ సిక్స్) ఎన్నికల హామీతో అధికారం చేజిక్కించుకున్న టీడీపీ తీవ్రమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడమే తలనొప్పి వ్యవహారంగా మారిందని చంద్రబాబు మహనాడులో సైతం వాపోయారు. ఆరు గ్యారంటీల్లో నాలుగింటికి ఇంకా దిక్కేలేదు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలు అటకమీద నుంచి దిగనేలేదు. ఆగస్టు కల్లా వీటిని అమల్లోకి తెస్తామని మహానాడు వేదికగా చెప్పడం కాస్త ఊరట కలిగించినా, గడిచిన ఏడాదిలో జరిగిన నష్టానికి ఈ మహానాడు సమాధానమివ్వలేకపోయింది. కార్యకర్తే అధినేత, యువగళం, సామాజిక న్యాయం-పేదల ప్రగతి, స్త్రీశక్తి, అన్నదాతకు అండగా, తెలుగుజాతి-విశ్వఖ్యాతి అనే ఆరు శాసనాలు మార్గదర్శక సూత్రాలంటూ చేసిన కీలక తీర్మానం విశ్వసించదగినదే. కాకపోతే ఈ పార్టీ అధికారంలో ఉన్నందున పాలనలో అది ప్రస్ఫుటంగా గోచరిస్తేనే దానికి సార్థకమవుతుంది. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అనేది ఎన్‌టీఆర్ నినాదం, ఆనాటి టీడీపీ నినాదం. కానీ బీజేపీ నినాదం అదికాదు. టీడీపీ ప్రధాన మిత్రపార్టీ అయిన బీజేపీ విధానం దానికి పూర్తిగా భిన్నమైనది. మతోన్మాదంతో ఊగిపోయే ఆరెస్సెస్ భావజాలాన్ని అంటగాకితే, టీడీపీ మూలసిద్ధాంత స్ఫూర్తికి విఘాతం కలగవచ్చు. బీజేపీ చాపకింద నీరు కాదు, చాపకింద చావు. టీడీపీ అధినేతతోపాటు ప్రతి కార్యకర్త దాన్ని గమనంలో పెట్టుకోవాల్సిన తరుణమిది. తెలుగువాళ్ల ఆత్మాభిమానాన్ని హస్తినలో తాకట్టుపెట్టాలన్నది ఎన్‌టీఆర్ ఆశయం కాదు. కార్పొరేట్లకు ఊడిగం చేయడం ఆ మహానేత లక్షణం కాదు. ఊసరవెల్లి రాజకీయాలతో రంగులుమార్చడం ఆ గొప్ప నాయకుని స్వభావం కానేకాదు. అందుకే, ఎన్‌టీఆర్ ఏ ఆశయాల కోసం పార్టీని స్థాపించారో వాటిని సాకారం చేసేందుకు పునరంకితం కావాల్సిన బాధ్యత తెలుగు తమ్ముళ్లది. అది మాటల్లో కాదు...చేతల్లో కన్పించాలి. ఏదేమైనప్పటికీ, మరోసారి టీడీపీ జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నారా చంద్రబాబునాయుడుకు అభినందనలు.

కోవిడ్ మళ్లీ విజృంభిస్తుందా?

అసద్ మిర్జా

కోవిడ్19 మొదటిసారి ప్రపంచ ప్రజలను వణికించింది. దాదాపు కోటిన్నరమందికిపైగా ప్రజలు మరణించారని ఐక్యరాజ్యసమితి ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనా వేసింది. మళ్లీ ఇప్పుడు కోవిడ్ ఇండియాతో సహా చాలా దేశాల్లో తిరిగి కనిపిస్తోంది. అయితే కోవిడ్‌తో ప్రపంచమంతటా చీకట్లు కమ్ముకునే పరిస్థితి ఉంటుందా? ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శకత్వంలో తాజాగా ఒక ఒప్పందం కుదిరింది. ఈ వ్యాధిని అదుపుచేసేందుకు అన్ని దేశాలు సమన్వయంతో పనిచేయాలని అందుకు అవసరమైన వాక్సిన్‌లను, ఇతర పరికరాలను సిద్ధంచేసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ కోరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ఎన్నికై అధికారం చేపట్టడం యాధృచ్ఛికమే కావచ్చు. మొదటిసారి కోవిడ్ వచ్చినప్పుడు అమెరికా చైనాను నిందించడమే కానీ తమ దేశంలో శ్రద్ధపెట్టి ఈ మహమ్మారిని అదుపు చేయడానికి పూనుకోలేదు. ప్రస్తుతం ఈ సారి హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాలలో ఎక్కువగా కోవిడ్ మహమ్మారి కేసులు నమోదవుతున్నాయి. భారతదేశంలో అంత ఎక్కువగా కేసులు నమోదుకాలేదు. ప్రభుత్వం పరిస్థితి అదుపులో పెట్టేందుకు సిద్ధమవుతోంది. మూడు సంవత్సరాల క్రితం మొదటిసారి కోవిడ్ సంభవించి నప్పుడు భారతదేశంలో ప్రారంభంలో మహమ్మారి నియంత్రణకు అంతగా సిద్ధపడలేదు. ఈ మహమ్మారి మొదట కేరళలో కనిపించింది. ఆ తరువాత క్రమంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించింది. అప్పుడు కూడా ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్యసంస్థ, అన్ని దేశాలు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి అవసరమైన వాక్సిన్‌లను తయారు చేసుకోవాలని కోరింది. అయితే ప్రపంచ ఆరోగ్యసంస్థ సూచనను పెద్దగా పట్టించుకోలేదు.

తాజాగా వేయికిపైగా కేసులు నమోదయ్యాయి. ఈసారి కూడా కేరళలో 335 కేసులు నమోదుకాగా, తాజాగా మహారాష్ట్రలో 430, తమిళనాడులో 34, గుజరాత్‌లో 83, కర్నాటకలో 47,ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమబెంగాల్‌లో 12 నమోదయ్యాయని సోమవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. కేసులుపెరిగే చిహ్నాలు కనిపిస్తున్నాయి. దిల్లీలో 99 కేసులు నమోదయ్యాయి. తీవ్రంగా ఆరోగ్యసమస్య ఉన్నవారు 209మంది ఉన్నారు. అయితే మంగళ, బుధ, గురు వారాల్లో మరిన్ని కేసులు నమోదయ్యాయి. కానీ, ఆరోగ్యమంత్రిత్వ శాఖ కొత్తగా నమోదైనవారి సంఖ్యను ఇంకా ప్రకటించలేదు. రెండు కొత్త సబ్ వేరియంట్‌లు- ఎన్‌బి.1.8.1 అలాగే ఎల్ఎఫ్.7 ఎక్కువగా ప్రమాదకరమైనవికావని చెబుతున్నారు. మొదటిసారి కోవిడ్ -19 భారత్‌లో ప్రవేశించిన తర్వాత ఇదంత ప్రమాదకరం కాదని ఆరోగ్య నిపుణులు అంచనావేశారు. ప్రస్తుతం విస్తరిస్తున్న వేరియంట్‌లను ప్రపంచ ఆరోగ్య సంస్థ శ్రద్ధతో గమనిస్తున్నది. ఇండియాలో సార్స్ కోవిడ్-2 జీనోమిక్స్ కన్సార్టియం రెండు వేరియంట్‌లను ధృవీకరించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఈ వేరియంట్ల విస్తరణను పరిశీలిస్తున్నది. అయితే ఈ వేరియంట్‌లు అంతగా ప్రమాదకరంకాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రస్తుతం తెలియజేసింది. ఇండియా వైద్యపరిశోధన మండలి పరిధిలోని మెడికల్ సహాయ సంస్థ, విధ్వంసక నిర్వహణ సెల్ ఈ వ్యాధిని నియంత్రించేందుకు నిపుణులు కృషిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రులలో ఈ వేరియంట్లపై సమీక్షించి గత వారం ఇలా తెలియజేసింది. "ప్రస్తుతం కోవిడ్ పరిస్థితి భారతదేశంలో నియంత్రణలో ఉందని ఈ సమావేశం అంచనా వేసింది." 2025 మే 19వ తేదీ నాటికి కోవిడ్ కేసులు దేశంలో 257 మాత్రమే ఉన్నాయి. ప్రపంచంలో అధికంగా జనాభా కలిగిన దేశంలో నమోదైన కేసులు తక్కువేనని చెప్పవచ్చు. ఈ కేసులన్నింటి లోనూ తీవ్రత కనిపించలేదని, వీరిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించవలసిన స్థితిలోలేవని అధికారి ఒకరు తెలిపారు. హాంకాంగ్, సింగపూర్‌లో కోవిడ్ కేసులు వేగవంతంగా పెరగనున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికార వర్గాలు విజ్ఞప్తి చేశాయి. సింగపూర్ ఆరోగ్య అంటు వ్యాధుల మంత్రిత్వశాఖ ఇంతవరకు 14,200 కేసులు నమోదైనట్లు తెలిపింది. ఏప్రిల్ 27 నుంచి మే 3వ తేదీవరకు కేసులు ఎక్కువగానే నమోదయ్యాయి. గత వారంలో 11,100 కేసులు ఉన్నాయని టైమ్స్‌పత్రిక తెలిపింది. హాంకాంగ్‌లో కొవిడ్ మహమ్మారి కేసులు క్రియాశీలంగా ఉన్నాయని మొదటిసారి కూడా ప్రతి 6నెలలనుంచి 9నెలలవరకు కేసులు విజృంభించాయి. రానున్న కొన్ని వారాల్లోనే ఇది తీవ్ర స్థాయిలో చేరుకోవచ్చునని హాంకాంగ్ ఆరోగ్య, రక్షణ నియంత్రణ అధికారి ఎడ్విన్ సుయ్ తెలిపారు. గత వారం ఈ సంవత్సరం అంతా కోవిడ్ కేసులు వేగంగా పెరుగుతాయని ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినట్లు సింగపూర్ ఆరోగ్య మంత్రి ఆంగ్ ఎ కంగ్ ప్రకటించారు. దక్షిణకొరియాలో నియంత్రణ, నిరోధక ఏజన్సీ గత నెల నుంచి మరో రెండు నెలలవరకు కోవిడ్ వ్యాధి నియంత్రణ వాక్సిన్‌ను ప్రారంభించి జూన్ చివరి దాకా కొనసాగిస్తామని తెలియజేసింది. 65ఏళ్లు దాటిన ప్రజలు ఫైజర్ కంపెనీ తయారుచేసిన జెఎన్ 1 వాక్సిన్‌ను వేసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి మహమ్మారులు సంభవించకుండా ప్రపంచ దేశాలన్నీ ఒక ఒప్పందానికి రావాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి ప్రపంచం భద్రంగానే ఉందని అంచనావేశారు. నాయకులు మొదటిసారి కోవిడ్ మూడేళ్ల క్రితం దాదాపు అన్ని దేశాలను చుట్టుముట్టినప్పుడు కూడా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అయితే ఇది సక్రమంగా పనిచేయలేదు. అన్ని దేశాలు నిబద్ధతతో కలిసికట్టుగా భవిష్యత్తు మహమ్మారుల నియంత్రణకు సమానమైన ప్రతిస్పందన రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి ఒప్పందం జరగడం వలన ప్రజల ఆరోగ్య రక్షణకు ఎక్కువ అవకాశం ఉంటుంది. బహుళ కార్యాచరణ చర్యలను చేపట్టాలి.

కోవిడ్ 19 సమయంలో కేసులు పెరుగుతున్నందున అన్ని దేశాలు ఆందోళనచెంది అంతర్జాతీయంగా పరస్పరం సహకరించుకున్నాయి. ఇప్పుడు ఒప్పందం అమలులోకి వచ్చి పనిచేసున్నాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. తక్షణం క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి అన్ని దేశాలు క్రియాశీలంగా పనిచేయాలి. ఆరోగ్య ఉత్పత్తులను ప్రాణాలను రక్షించేందుకు సమంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. ప్రపంచ ఆరోగ్యసంస్థ మహమ్మారి ఒప్పందాన్ని సంక్షోభం నుంచి జీవనకాలంలో ఒక్కసారి అయినా తగిన గుణపాఠాలను నేర్చుకుని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రపంచ ఆరోగ్యసంస్థ మహమ్మారి ఒప్పందానికి తగిన సూత్రాలు, తీసుకోవలసిన చర్యలు, పరికరాల సమీకరణ, అంతర్జాతీయ సమన్వయాన్ని ఆచరించాలి. ప్రపంచ ఆరోగ్యసంస్థ నియంత్రణలో ఒప్పందాలను అమలుచేసి తీరాలి.

> ఈ సారి హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాలలో ఎక్కువగా కోవిడ్ మహమ్మారి కేసులు నమోదవుతున్నాయి. భారతదేశంలో అంత ఎక్కువగా కేసులు నమోదుకాలేదు. ప్రభుత్వం పరిస్థితి అదుపులో పెట్టేందుకు సిద్ధమవుతోంది. మూడు సంవత్సరాల క్రితం మొదటిసారి కోవిడ్ సంభవించి నప్పుడు భారతదేశంలో ప్రారంభంలో మహమ్మారి నియంత్రణకు అంతగా సిద్ధపడలేదు. ఈ మహమ్మారి మొదట కేరళలో కనిపించింది.

నా అడ్రసు ఎక్కడ

వివేచన - బండారు రాధాకృష్ణ

ఈ సమాజంలో నే నెక్కడ ఉన్నాను...నా అడ్రసు ఎక్కడ. అసలు నేను బతికే ఉన్నానా. రా బావ ఏంటి ఈ రోజు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. అవునయ్యా నీ కలాగే అనిపిస్తుంది. అడ్రసు లేని మనిషి బాధ నీ కర్థంకాదు. నేను నీకు కనబడుతున్నాను కనుక ఉన్న ట్లే అనుకుంటున్నావు. నా దృష్టిలో నేనే కాదు దేశంలో కోట్లాదిమంది భౌతికంగా ఉన్నా మానసికంగా ఎప్పుడో పోయారు. ఏంటి అంత బాధ ఇపుడేమొచ్చింది. నేనేంటి నువు కూడా. మనం అసలు మనుషులమేనా. మనిషికి కావలసింది కూడు, గూడే కదయ్యా ఆ రెండు ఉన్నవారు దేశం కోసం ఎంతోమంది ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారు. ఎందుకనుకున్నావ్ జంతువులకు లేని మెదడు మనిషికుంది. అది విపరీతంగా ఆలోచిస్తుంది. ఆలోచనల ఫలితంగా కొన్ని బాధలు కావచ్చు, అందులోంచి కోరికలు కలుగుతాయి. అది తీర్చుకోవడానికి మనిషే ఉద్యమిస్తాడు. ఇది మానవ ధర్మం. అసలు స్వేచ్ఛ లేని బతుకు బతుకే కాదు. నిజమేనయ్యా. నీవన్నట్లు సమాజంలో అవసరాలు తీర్చుకోవడానికి సమష్టి పోరాటం అవసరంగా గుర్తించి సమాజాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తరువాత ఒక కార్యస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. నాగరికుడుగా అవతరించిన తరువాత ఒక సంఘాన్ని, ఒక సంస్థ, ఒక పార్టీని ఏర్పాటు చేసుకున్నాడు. అదేనయ్యా అక్కడే వచ్చింది చిక్కు. ఏర్పాటయిన తర్వాత ఆ సంస్థ, ఆ పార్టీనో నడిపేవారు అందులో ఉన్న సభ్యుల్ని విస్మరించి ఏనాడో గతించిన రాజుల పాలననుసరించి పరిపాలించడం మొదలుపెట్టారు.

చూడు నా బాధ అదేనయ్యా ఆయా పార్టీలలో సభ్యులు నామమాత్రమై నేనెక్కడ ఉన్నానని ప్రశ్న వేసుకోవలసి వచ్చింది. అంతెందుకు ప్రతి సామాజికవర్గం నుంచి ఎంతో స్వేచ్ఛగా ఒక సభ్యుడ్ని ఎన్నుకుంటాం. ఆ తరువాత పార్టీ అదేశాలు ప్రకారం ఒక వ్యక్తి ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసి ఆయనకు సంబంధించిన వర్గం నుంచి కొంతమందిని మంత్రులుగా నియమించుకుంటారు. ముఖ్యమంత్రి అయిన వ్యక్తి పార్టీలు రెండు గ్రూపులుంటే ఒక గ్రూపు నుంచే మంత్రులు ఎంపికయ్యారు. ప్రజాస్వామ్య దేశం కనుక అనేక రాజకీయ పార్టీలుండవచ్చు. కాని ఒక పార్టీనే ప్రజలు ఎన్నుకుంటే ఆ పార్టీలో ఒక వర్గం వారే మంత్రులై మొత్తం దేశాన్ని పరిపాలిస్తున్నారు. దానివల్ల ఎన్నుకున్న ప్రజల్లో నాల్గోవంతువారు పాలన సాగిస్తున్నారు. అన్ని పార్టీల నుంచి ఎన్నికయిన ప్రతి శాసనసభ్యునికి పాలించే ప్రతి మంత్రిని ఎన్నుకునే అధికారం ఉన్నప్పుడే దాన్ని ప్రజాస్వామ్య దేశంగా పరిగణించాలి. అందుకే కదయ్యా నేను ఎన్నుకున్న శాసనసభ్యునికే మంత్రిని ఎన్నుకునే అధికారం లేనప్పుడు ఇంకా నా ఓటుకు విలువ లేనట్లేగా. అందుకే నా అడ్రసు ఎక్కడ, సంఘంలో నా పార్టీలో నేను నిమిత్తమాత్రునిగా మారిపోయాను. నిర్వీర్యమైపోయాను. నేను ఏర్పాటు చేసుకున్న సమాజంలో నేనసలు ఉన్నానా అనే సందేహం. అందుకే బాధ పడుతున్నా.

నిజమేనయ్యా అసలు ప్రతి మనిషి ఆలోచించగలడుకనునే ఆ ఆలోచన వల్ల సమాజం ముందడుగు వేస్తుంది. లేనట్లయితే ఇంకా ఆటవిక దశలోనే ఉండేవారు. కాని ఈ రోజు ఆలోచించకుండా నాయకుల్ని అనుసరించవలసిన పరిస్థితి ఉంది. అధినాయకుడు ఏం చేసినా గంగిరెద్దు తల ఊపినట్లుగా మనిషి కర్తవ్యంగా మారింది. ఈ పరిస్థితి దాపురిస్తుందని ఆనాడు ఆంగ్లేయులను తరిమిగొట్టి స్వతంత్రదేశంగా మనల్ని మనమే పాలించుకుని మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలనే తలంపుతో ప్రాణాలర్పించిన నాయకులు ఈ నాటి పరిస్థితిని కలలో కూడా ఊహించి ఉండరు. అసలు దీనికంతటికి మనిషిలో పెరిగిన స్వార్థమే కారణం. అధికారులు, అనధికారులు ఎన్నుకున్న ప్రజల ఆస్తులు సొంత ఆస్తులుగా భావించి అందినకాడికి కాజేసి సొంత ఆస్తులు పెంచుకుని అవినీతికి సాక్ష్యంగా పేరుగాంచి ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. ప్రశ్నించిన వారిని దండించడం ఒకటే వారి పనిగా భావిస్తున్నారు. ఇక్కడ కుదరదని అడవిబాటపట్టిన నక్సలైట్లను చంపడానికి ప్రజాధనం అమితంగా వెచ్చిస్తున్నారు. సామాన్య ప్రజలు అవసరాలు తీర్చడానికి కనబడని నిధులు పాలకుల అన్యాయాన్ని ప్రశ్నించిన నక్సలైట్లను చంపడానికి ఖర్చు చేయడం ఎంత హేయమైన పనో ఆలోచించాలి.

ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం దూసుకుపోతోందని పాలించేపార్టీ వారి ఉవాచ. వందకోట్లున్నవాడు వేయి కోట్లవైపు దూసుకుపోతున్నమాట నిజం. వాళ్ల ఆస్తుల ప్రకారం లెక్క కట్టి సగటున తలసరి ఆదాయం పెరిగిందని లెక్కలు చెబుతారేగాని సామాన్యుడి ఆదాయం ఎక్కడ పెరిగిందో చెప్పరు. పెరిగితే సంక్షేమంతో అవసరం ఉండదు. మనిషికి కావలసింది చేయడానికి పని, తినడానికి తిండి అవసరం అంటారు. నిజానికి మనిషికి ఆరెంటికంటే ముఖ్యంగా స్వేచ్ఛ అవసరం. సమాజంలో భావస్వేచ్ఛ ముఖ్యం. ఆ స్వేచ్ఛను హరించి తిండిపెట్టి పడుకోమంటే జంతువులతో సమానమే. జంతువులకు ఆలోచించేశక్తి ఉండదు కనుక తిని పనిచేసి నిద్రోపోతాయి.కాని మనిషి నిత్యపరిశోధకుడు. మనిషి ఆలోచనలు ఆపడంగాని నియంత్రించడం గానిచేస్తే మనిషి విప్లవించక తప్పదు. ఆ స్థితిలోనే విప్లవాలకు దారి తీస్తాయి. ఏది ఏమైనా ముఖ్యంగా కావలసింది స్వేచ్ఛ. దాన్ని హరించే హక్కు ఎవరికి ఉండదు. ఈ విషయం ఏలేవారు గ్రహించాలి.

సెల్ : 9885569394

సాహితీ సంద్రంలో ఉద్యమ కెరటం శేషేంద్ర

తోట రంగమణి

కవి, సాహిత్య విమర్శకుడు, అలంకార శాస్త్రాలను ఔపోసన పట్టిన సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పండితుడు, దేశ విదేశాల్లో తెలుగు సాహిత్య పతాకం ఎగురవేసిన ఏకైక తెలుగు కవి శేషేంద్ర. శేషేంద్ర తన 20వ యేటనే తొలిసారిగా "సోరాబు" అనే ఒక స్వతంత్ర పద్య కావ్యం రచించారు. ముద్రితమైన మొదటి రచన "ఒక పాట". ఆయన కవిత్వం భావ అభ్యుదయ కవిత్వాల అపూర్వ సమ్మేళనంగా కనిపిస్తుంది. ఆయన రచనలు సంప్రదాయ, ఆధునికతత్వాల మేళవింపు. వచన కవిత్వం, పద్య రచన రెండింటిలోనూ సమాన ప్రతిభావంతులు. సృజన, విమర్శన, పరిశోధన శక్తులు ఒకే వ్యక్తిలో ఉండటం అరుదైన అద్భుతం.కవికి, విమర్శకునికి ఉండవలసిన ప్రధాన చైతన్యం అనుభూతికిలోను కావడమేనని చాటిన వారు శేషేంద్ర. సాహిత్యాన్ని ఆత్మకళగా భావించారు. సాహిత్య స్పృహలు, సత్య ధర్మాల తాత్పర్యం మీదనే శేషేంద్ర సాహితీ వ్యాసంగం కొనసాగింది. తొలినాళ్లలో ఆయన రచనలు పద్య రూపంలో సాగినా, తరువాత కాలంలో గేయం, వచన, దీర్ఘ వచన కవితా రూపాలలో ప్రయాణించారు. ప్రగతిశీల దృష్టితో కవితా రచన చేశారు. ఆధునిక కావ్య భాషను సృష్టించి, పాశ్చాత్య ఇతిహాస ప్రక్రియలను అధ్యయనంచేసి, వాటిని ఆధునిక ప్రక్రియలుగా మార్చి, కొత్త భావాలు, ప్రతీకలను ఆధునిక వచన కవిత్వానికి అందించిన వారు శేషేంద్ర.

ఋతుఘోష (1963) శేషేంద్ర పద్య విద్యలో విశిష్టమైన రచన. శేష జ్యోత్స్న (1972) వచన కవితా ప్రస్థానానికి నాంది. మండే సూర్యుడు, నా దేశం నా ప్రజలు, గొరిల్లా విప్లవ కవితా బాటలో రాసినవి. నా దేశం నా ప్రజలు (1975) ఒక ఆధునిక ఇతిహాసం. వ్యక్తీకరణ, కవితా వస్తు విన్యాసంలో ఈయన తనదైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. తొలి ముద్రణకు శేషేంద్ర ఉపోద్ఘాతంలో ఇతిహాస నిర్మాణానికి బాధానుభూతి పూర్వక బలి కావాలి, నేనే ఆ బలి, నా వయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి మాటల గొంతులో పోసిన నా రక్తం ఈ ఇతిహాసం. ప్రపంచ మానవుల్ని, వాళ్ల చరిత్రల్ని, వాళ్ల జయాపజయాల్ని, వాళ్ల భూత భవిష్యద్వర్తమానాలని అనుభవ జ్ఞాన నేత్రద్వంద్వంతో అవలోకన చేసి ఆ విశ్వదృశ్యం నుంచి ఈ తాత్పర్యం పిండాను, మే నెలలో నీలగిరి కొండల్లో కూర్చుని అని ఆయన రాసుకున్నారు. వర్తమాన ఆంధ్ర కవిత్వంలో ఇతిహాసం ఒక అచుంబితమైన ప్రక్రియ. సామాన్య కర్షకుని జీవిత గాధే నాదేశం నా ప్రజలు ఇతివృత్తం.ఇంగ్లీషును మన దేశానికి ఆధునిక సంస్కృతంగా అభివర్ణించిన శేషంద్ర ఈ కావ్యాన్ని ఆ భాషలోకి(మై కంట్రీ మై పీపుల్) కూడా తానే అనువదించడం ఆయన పాశ్చాత్య పాండిత్యానికి నిదర్శనం. విడివిడిగా కావ్య రూపంలో ఉన్న ఈ రచనలన్నీ పర్వాలుగా విభజించి ఆధునిక మహాభారతంగా మలిచారు. అరుస్తున్న ఆర్మీ అనే చిన్న కవితలు ఆర్మీ పర్వంగా మారితే, శేష జ్యోత్స్న జ్యోత్స్న పర్వంగా, నా దేశం నా ప్రజలు ప్రజాపర్వంగా, సముద్రం నా పేరు సముద్ర పర్వంగా రూపొందాయి. 1977 లో వచ్చిన కవిసేన మేనిఫెస్టో, అసలు కవిత్వం అంటే ఏమిటి? ఎలా రాయాలి? ఎందుకు రాయాలి? ఎవరికోసం రాయాలి? ఇటువంటి తాత్విక అంశాలపై ఆధునిక సాహిత్యంలో తెలుగులో వెలువడిన ప్రామాణిక గ్రంథం. అప్పట్లో సాహిత్యంలో అన్ని వర్గాలను, అన్ని సంఘాలను తీవ్రమైన ఆందోళనకు మనస్తాపానికి గురిచేసింది. దేశానికి నాయకత్వం వహించాల్సిన కవి, రాజకీయ భవనాల్లో పెంపుడు కుక్కగా బ్రతకడాన్ని నిరసిస్తూ తనకున్న ఆయుధాలను గమనించి, వాటికున్న చైతన్యాన్ని గుర్తించి సరిగ్గా ప్రయోగించి వైజ్ఞానిక నాయకత్వాన్ని దేశానికి ప్రసాదించాల్సిన బాధ్యత కవికి ఉందని చెప్పే ప్రణాళిక ఇది. కవితా శిల్పం ఎలా ఉండాలో ఈ కావ్య శాస్త్రంలో " కవిత్వం శబ్ద శిల్పమా?" అనే ప్రకరణలో విపులంగా చర్చించారు.. ఈ కావ్య శాస్త్రంలో విశ్వవ్యాప్తులైన ప్రాక్పశ్చిమ కవుల రసవత్ కావ్య ఖండికలను, కవితా సిద్ధాంతాలను చర్చిస్తూ సుమారు 60 ఏళ్ల క్రితమే అక్షరీకరించిన ఆధునిక వైజ్ఞానిక ఉద్యమ కావ్య శాస్త్రం కవిసేన మేనిఫెస్టో. కవిత్వం అంటే జన్మతః వచ్చే ప్రతిభా కాదని అది ఒక విలక్షణ అనుభూతి అని తీర్మానించింది. కవిత్వం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో సుదీర్ఘంగా చర్చిస్తూ అనేక ప్రామాణిక గ్రంథాలను, కవులను ఉటంకిస్తూ శేషేంద్ర శర్మ చేసిన రచన అన్ని కాలాలకు వర్తిస్తుంది.

అక్షర యోధులకు దిశానిర్దేశం చేయడానికి ఆ మహోన్నత స్వాప్నికుడు రూపకల్పన చేసిన వైజ్ఞానిక ఉద్యమ దీపిక కవిసేన మేనిఫెస్టో. శేషేంద్ర తన కవిత్వాన్ని ఉద్యమ బాటలో నడిపారు. అందుకు ఉదాహరణ "ఈ చెట్లు పూలు ఎందుకు పూస్తాయి, ఈ నికృష్టపు నాగరికత విడిచే బొగ్గు పులుసు వాయువు పిలుస్తూ ఇవి బుల్లెట్లు ఎందుకు పూయవు?" అని కేక వేస్తా! కలుషితమైన ఈ సమాజం నిష్కల్మషం కావాలంటే ఈ నికృష్టపు నాగరికతను వదిలించాలంటే ఇక్కడ ప్రకృతిలో మార్పు రావాలి. ఇక్కడి చెట్లు పూలకు బదులు బుల్లెట్లను పూయాలని శేషేంద్ర అనడంలో విప్లవం ఒక్కటే పరిష్కార మార్గం అని భావించాడు. అందుకే " కవిత్వం వద్దు వెయ్యి ప్రళయాలు దట్టించిన ఒక బాంబు ఇవ్వండి" అంటాడు. ప్రశ్నించడం, కేకలు వేయడం, అరవటం ఇవన్నీ విప్లవ ఉద్యమంలో నడిచేవారికి ఊతమిచ్చే పదాలే. శేషేంద్ర కవితా రచనలో ఇవి అనేకం కనిపిస్తాయి. " కొత్త పద్యాలల్లుతున్న, జీర్ణం కాకుండా నేనున్న ఆ నగరాలకు ఆవల నా ఆత్మ, తన నులివెచ్చని కోర్కెలు పొదుగుతున్న ఆ అడవుల కావాల" అని అనడంలోనూ శేషేంద్ర మనసులో ఉన్న విప్లవోద్యమ భావాలు స్పష్టంగా కనిపిస్తాయి.

1994 లో వచ్చిన జనవంశం, ఆధునిక మహాభారతం అనుబంధ కావ్యం. పూర్వకాలంలో ప్రతి ఇతిహాసానికి ఒక అనుబంధ కావ్యం ఉండేది. వాల్మీకి రామాయణానికి ఉత్తరాకాండ, వ్యాస మహాభారతానికి హరివంశం, హోమర విరచిత ఇతిహాసానికి ఆడిసి అనుబంధ కావ్యాలు లాగా, ఇతిహాస కావ్య రచన ప్రక్రియనుసారంగా ఆధునిక మహాభారతానికి అనుబంధ కావ్యంగా ఈ జనవంశం వచ్చింది అని ప్రకాశకీయం (పుట. 31) స్పష్టం చేస్తోంది. ఆధునిక మహాభారతం శేషేంద్ర వచన కవిత సంకలనాల పుష్పగుచ్ఛం. కానీ అనుబంధ కావ్యమైన ఈ జనవంశంలో ఛందోబద్ధ పద్యం, గేయం, గీతం, వచన కవిత, మినీ కవిత శేషేంద్ర సృజించిన చమత్కారిక అన్ని కవితా రూపాలు ఉన్నాయి. నగరం చంబల్ వ్యాలీ, గ్రామం, దేశానికి కూలి వంటి ఖండికలు ఈనాటి సామాజిక వ్యవస్థను తీవ్రంగా ఖండిస్తున్నాయి. శేషేంద్రలోని దార్శనిక పార్శ్వం ఎంతో నిగూఢమైనది. కాలం గురించి రాస్తూ, ఒక కొమ్మ గురించి ఇలా అంటారు "నగ్న శాఖే గాని కాలం అందులో ప్రవహిస్తుంది రాగి తీగలో విద్యుత్తులా". ఈయన రాసిన సాహిత్య వ్యాస సంపుటి "కాలరేఖ"కు 1994 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఇందులో ప్రాచీన సంస్కృత నాటకం, ప్రాచీన గ్రీకు నాటకం, తులనాత్మక సాహిత్యం, శాస్త్రీయ కవిత్వం, అరబిందో, సావిత్రి వంటి విషయాలు మనకు అగుపడతాయి. ఆయన సాహిత్య కృషికి కాలరేఖ ఒక మంచి నమూనా. 2004లో నా దేశం నా ప్రజలు నోబెల్ బహుమతికి నామినేట్ అయింది. ప్రపంచస్థాయిలో సాహిత్య రంగంలో నోబెల్ పురస్కారానికి ఎంపిక జాబితా వరకు వెళ్లిన ఏకైక తెలుగు కవి శేషేంద్ర.1993లో సుబ్రహ్మణ్య భారతి రాష్ట్రీయ సాహిత్య పురస్కారం, రాష్ట్రీయ సంస్కృతి ఏక్తా పురస్కారం, 1994లో తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, భారత ప్రభుత్వ "రాష్ట్రేంద్రు" బిరుదు, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డులు లభించాయి.

శేషంద్ర తెలుగు సాహిత్య లోకానికి దాదాపు 55 సంవత్సరాల సుదీర్ఘకాలం సేవ చేశారు. ఆయన కలం నుంచి జాలువారిన మరొక ఆణిముత్యం ఒకే ఒక సినీ గేయం ముత్యాలముగ్గు చిత్రంలోని, "నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది." సినీ ప్రేమికుల హృదయాల్లో ఇప్పటికీ నిలిచింది. సినీ సాహిత్యంలో ఆయన కొనసాగి ఉంటే ఎన్నో మనసును రంజింపజేసే గీతాలు ఆయన కలం నుంచి జాలు వారేవి. కానీ ఆయన రాయాలని అనుకోక పోవడం సినీ సాహిత్య లోకానికి తీరని లోటు. ఆయన సాహిత్య సేవకు తగిన గుర్తింపు ప్రభుత్వం తరపున రాలేదని సాహితీ లోకం అంటుంది. "జ్ఞానపీఠం" పురస్కారానికి అన్ని అర్హతలు ఉన్నను ఆ పురస్కారాన్ని అందించకపోవడం ఆ సంస్థకే అగౌరవం. అయినను అసంఖ్యాక సాహిత్య పాఠకుల, ప్రేమికుల హృదయాల్లో సూర్యచంద్రులు ఉన్నంతవరకు నిలిచే ఉంటారు మన విప్లవ భాషా విధాత.

(నేడు 18వ వర్ధంతి సందర్భంగా)

యూనిఫామ్ లేని యుద్ధ వీరుడు

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత వైమానిక దళం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు చనిపోవటంతో పాకిస్థాన్ రెచ్చిపోయింది. భారత్‌పై యుద్ధానికి కాలు దువ్వింది. సరిహద్దు ప్రాంతాలపై క్షిపణులు, డ్రోన్ దాడులు చేసింది. ఇదే అదునుగా పాక్ సైన్యం కూడా సరిహద్దుల దగ్గర కాల్పులకు తెగబడింది. యుద్ధం నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లోని భారత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భయంతో బయటకు రావటమే మానేశారు. కానీ, ఒకే ఒక్కడు చావుకు భయపడలేదు. యుద్ధానికి అసలే బెదరలేదు. పాకిస్థాన్ సేనలతో పోరాడుతున్న జవాన్ల దగ్గరకు వెళ్లాడు. వారికి తన వంతు సాయం చేశాడు. వివరాల్లోకి వెళితే...

భారత్, పాక్ యుద్ధం సమయంలో భారత సైనికులు పంజాబ్, ఫిరోజ్‌పూర్ జిల్లాలోని కొన్ని గ్రామ పొలాల్లో క్యాంపులు వేశారు. శత్రు దేశానికి తగిన విధంగా సమాధానం చెబుతూ ఉన్నారు. శ్రవణ్ సింగ్ అనే పదేళ్ల బాలుడు తమ పొలంలో ఉన్న జవాన్ల క్యాంపు దగ్గరకు వెళ్లాడు. అది కూడా జవాన్ల కోసం నీళ్లు, పాలు, లస్సీ తీసుకెళ్లాడు. అలా ఒక్కసారి కాదు... చాలాసార్లు తీసుకుని వెళ్లాడు. ఆ వయసులోని పిల్లలు గట్టిగా శబ్దం వినపడితేనే భయపడతారు. అలాంటిది శ్రవణ్ సింగ్ మాత్రం ఎలాంటి భయం లేకుండా జవాన్లకు సాయం చేశాడు. అతడి ధైర్య సాహసాలు, చేసిన సాయాలను భారత సైన్యం గుర్తించింది. మేజర్ జనరల్ రంజిత్ సింగ్ మన్రల్... శ్రవణ్ సింగ్‌ను పిలిచి సత్కరించాడు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ 'నేను భయపడలేదు. నేను పెద్దవాడినయ్యాక సైనికుడు అవ్వాలని అనుకుంటున్నాను. నేను సైనికుల కోసం నీళ్లు, లస్సీ, పాలు, ఐస్ క్రీములు తీసుకెళ్లేవాడిని. వారు నన్ను ఎంతో ప్రేమగా చూసుకునే వారు' అని అన్నాడు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే...

మోదీ చర్యలపై కాంగ్రెస్ విమర్శ

న్యూదిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశం వచ్చే నెలలో జరగవచ్చని కాంగ్రెస్ పేర్కొంది. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు అయ్యే సందర్భంగా చట్టసభలను సమావేశపర్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలిపింది. వాస్తవ పరిస్థితులు, సమస్యలు, కీలకాంశాలపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని మోదీ 'డైవర్షన్- డిస్ట్రాక్షన్' వ్యూహంలో భాగంగా జరిగే మరో కసరత్తు అని వ్యాఖ్యానించింది. పహల్గాం ఉగ్రదాడి నాటి నుంచి ప్రధాని అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ కోరుతోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అది ఇప్పటివరకు జరగలేదన్నారు. 'పార్లమెంటు ప్రత్యేక సెషన్ నిర్వహించాలని, ఓ తీర్మానం ద్వారా దేశ ఉమ్మడి సంకల్పాన్ని తెలియజేయాలని ప్రధానికి సూచిస్తూ లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకులు లేఖ రాశారు. కానీ వారి సూచనలను ప్రధాని పరిగణనలోకి తీసుకోలేదు. అయితే ఎమర్జెన్సీకి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా జూన్ 25-26 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావిస్తోంది' అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఎవరైతే దేశంలో 11 ఏళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ సాగిస్తున్నారో... ఎవరైతే పహల్గాం ఉగ్రదాడుల పరారీపై ప్రశ్నలకు సమాధానం ఇవ్వరో... ఎవరైతే కాల్పుల విరమణ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అనుమతిచ్చారో... ఎవరైతే 2020, జూన్ 19న చైనాకు క్లీన్‌చిట్ ఇచ్చారో... ఇప్పుడు అదే ప్రధాని మరోమారు వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మరొక కసరత్తుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించబోతున్నారు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

నా వ్యాఖ్యల వక్రీకరణ: శశిథరూర్

న్యూదిల్లీ: బీజేపీ సూపర్ అధికార ప్రతినిధిగా శశి థరూర్‌ను నియమించాలంటూ కాంగ్రెస్ పార్టీ సహచరుడు ఉదిత్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై శశిథరూర్ స్పందించారు. తాను ప్రస్తుతం జరిగిన ఉగ్రదాడుల గురించి మాత్రమే మాట్లాడానని, గత యుద్ధాల గురించి ప్రస్తావించలేదని గురువారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'నా దగ్గర ఎక్కువ సమయం లేదు. కానీ, గతంలో నియంత్రణరేఖ వెంబడి భారతీయ శౌర్యం గురించి నాకు తెలియదన్నట్లు మాట్లాడుతున్న వారి గురించి నేను స్పందిస్తున్నా. నేను ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రతీకార చర్యల గురించే మాట్లాడాను. గత దాడులను గురించి ప్రస్తావించలేదు. ఇటీవల మనపై జరిగిన దాడులను, దానికి మన ప్రభుత్వం స్పందించిన విధానాల ఆధారంగానే నేను మాట్లాడాను. అయితే... ఎప్పటిలాగానే కొందరు విమర్శకులు, ట్రోలర్‌లు తమకు తగినట్లుగా నా వ్యాఖ్యలను వక్రీకరించడంలో విజయం సాధించారు. నేను చేయాల్సిన పనులు ఇంకా చాలా ఉన్నాయి' అని థరూర్ రాసుకొచ్చారు.

థరూర్... మీతో ఏకీభవిస్తున్నా: పవన్ ఖేడా

న్యూదిల్లీ: మోదీ సర్కార్ అనుకూల వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్‌పై ఆ పార్టీ మరోనేత పవన్ ఖేడా గురువారం స్పందించారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ శశిథరూర్ రాసిన పుస్తకంలోని ఒక పేరాను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌పై థరూర్ తన పుస్తకంలో తెలిపిన ఉద్దేశంతో తానూ ఏకీభవిస్తున్నట్లు పోస్టు చేశారు. '2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌ను రాజకీయ మైలేజీ కోసం వినియోగించుకున్నారు. మైన్మార్‌లో తిరుగుబాటుదారులను ఎదుర్కోవడంలో భాగంగా జరిగిన సైనిక దాడిని కూడా ఎన్నికల ప్రచారంలో వాడుకున్నారు. అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఇలాంటి పని ఎన్నడూ చేయలేదు' అని శశిథరూర్ విమర్శించారు. దీనికి సంబంధించిన పేరా ఫొటోను పవన్ ఖేడా 'ఎక్స్'లో షేర్ చేశారు. 'ప్రస్తుతం ఈ పుస్తకాన్ని నేను చదువుతున్నాను. శశిథరూర్... మీరు చేసిన వ్యాఖ్యలతో నేను ఏకీభవిస్తున్నా' అని పోస్టు చేశారు.

100 రోజుల్లో 21 కార్యక్రమాలు: ఈసీ

న్యూదిల్లీ: ఎన్నికల నిర్వహణ ప్రక్రియ క్రమబద్ధీకరించడం ద్వారా ఓటర్లకు మంచి అనుభవం అందించే ఉద్దేశంతో గత 100 రోజుల్లో 21 కొత్త కార్యక్రమాలను ఎన్నికల సంఘం చేపట్టింది. సంస్కరణలు చేసింది. శిక్షణలు నిర్వహించింది. ఇదంతా 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 100 రోజుల పదవీ కాలంలో జరిగిందని అధికారులు గురువారం తెలిపారు. ఓటర్లకు మరిన్ని సేవలు అందుబాటులోకి తేవడం, పోలింగ్ కేంద్రాల్లో ఎలక్టర్ల సంఖ్య పెంచడం, గ్రేటెడ్ కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాల్లో అదనపు బూత్‌లు ఏర్పాటు చేయడం వంటివి ఈ కార్యక్రమాల్లో భాగంగా జరిగినట్లు చెప్పారు. ఇకపై ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రెండు కిలోమీటర్లకు మించి ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. అభ్యర్థులు ఏర్పాటు చేసే బూత్‌లు కూడా పోలింగ్ కేంద్రాల ప్రవేశానికి 200 మీటర్లకు బదులు 100 మీటర్లలోపే ఉండనున్నాయి. వినియోగ సౌలభ్యత కోసం సింగిల్ పాయింట్ న్యూ ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్ ఈసీఐ నెట్ అందుబాటులోకి వచ్చింది. 40కుపైగా యాప్‌లకు బదులు ఈసీఐ నెట్ ద్వారా అన్ని సేవలు ఒకే చోట పొందే వీలు కలిగింది. ఈ మేరకు మార్పులు చేర్పుల గురించి అందరు భాగస్వాములు, 28వేల మందికిపైగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో 4,719 సమావేశాలను ఈసీ నిర్వహించింది.

పుదుచ్చేరిలో మద్యం ధరల పెంపు

చెన్నై: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో మద్యంపై పెంచిన ధరలు అమలులోకి వచ్చాయి. బీరుకు రూ.10, క్వార్టర్ బాటిల్ రూ.6 నుండి రూ.30 వరకు ధర పెంచుతూ ఆ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. మార్చిలో జరిగిన పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రంగస్వామి అనేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. ఈ పథకాలను విజయవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వానికి అదనంగా రూ.500 కోట్లు అవసరమని, ఆ స్థాయి నిధులు ప్రభుత్వ ఖజానాలో లేనందున ప్రభుత్వ ఆదాయం పెంచాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రప్రజలపై ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా మద్యం ధరలు పెంచాలని నిర్ణయించారు. ఆ మేరకు మద్యంపై ఎక్సైజ్ సుంకం, దుకాణాలకు లైసెన్స్ ఫీజు పెంచాలని నిర్ణయించారు. రెండు నెలల అనంతరం మద్యం ధరలు పెంచుతూ నిన్న విడుదల చేసిన జీవో వెంటనే అమలుకు వచ్చింది. ఈ జీవో ప్రకారం క్వాంటిటీని బట్టి ఒక్కో మద్యం సీసాకు రూ.6 నుండి రూ.120 వరకు ధర పెంచారు. బీరు సీసాపై రూ.5 నుండి రూ.10 వరకు పెంచిన ధర వెంటనే అమలులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. 750 మి.లీ. ఫుల్‌బాటిల్‌కు బ్రాండును బట్టి రూ.24 నుండి రూ.120 వరకు ధర పెంచడంపై మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో భారత్‌లోకి పీఓకే

రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



న్యూదిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ప్రజలు భారతీయ కుటుంబంలో భాగమని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. వారు తిరిగి భారత ప్రధాన స్రవంతిలో కలిసిపోయే రోజు దగ్గర్లోనే ఉందని స్పష్టం చేశారు. భారత్‌తో లోతైన బంధాన్ని పీఓకే ప్రజలు అనుభూతి చెందుతున్నారన్న రాజ్‌నాథ్... వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. త్వరలో భారత్‌లో కలిసిపోయి గర్వంగా తాము భారతీయులమని చెప్పుకుంటారని వివరించారు. దిల్లీలో సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న రాజ్‌నాథ్... పాకిస్థాన్‌తో భారత్ వ్యవహరించే తీరు మారిందని తెలిపారు. పెంచి పోషించిన ఉగ్రవాదం వల్ల పాకిస్థాన్ ఇప్పుడు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందన్నారు. "ఉగ్రవాదాన్ని పోషించడం ఖర్చుతో కూడుకున్నది కాదు. అయితే దానికి ఎంత మూల్యం చెల్లించాల్సి వస్తుందో కూడా ఈరోజు పాకిస్థాన్‌కు తెలిసివచ్చింది. ఉగ్రవాదంపై వ్యూహాన్ని, ప్రతిస్పందించే విధానాన్ని భారత్ పునఃరూపకల్పన చేశాం. పాకిస్థాన్‌తో మన సంబంధాలు, చర్చల పరిధిపై కొత్త అంచనాలు వేసుకున్నాము. ఇప్పుడు చర్చలంటూ ఉంటే అది ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ అంశాలపైనే. పీఓకేలోని ప్రజలు మావారే, మా కుటుంబంలోని భాగమే అని నేను నమ్ముతున్నాను. ప్రధాని మోదీ చెబుతున్న 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' సంకల్పానికి కట్టుబడి ఉన్నాము. భౌగోళిక, రాజకీయ కారణాలతో మన నుంచి విడిపోయిన మన సోదరులు కూడా ఏదో ఒక రోజు వారి ఆత్మ చెప్పే మాటలు విని భారతదేశ ప్రధాన స్రవంతిలోకి తిరిగి వస్తారని మాకు పూర్తి నమ్మకం ఉంది." అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ ఆయుధ రక్షణ సామర్థ్యం భారీగా పెరిగిందని రక్షణమంత్రి తెలిపారు. 10 ఏళ్ల క్రితం భారత రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు కేవలం వెయ్యికోట్లే ఉండేవనని... ఇప్పుడు అది రూ.23,500 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. భారతదేశ భద్రత కోసం రక్షణ రంగంలో మేకిన్-ఇండియా ఎంతో అవసరమని ఇప్పుడు తెలుస్తోందని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ ఆయుధ వ్యవస్థలు ప్రదర్శించిన సామర్థ్యం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని చెప్పారు. ప్రస్తుతం ఫైటర్ జెట్‌లను లేదా క్షిపణి వ్యవస్థలను నిర్మించడమే కాకుండా భవిష్యత్ యుద్ధ సాంకేతికతలో కూడా ముందడుగు వేస్తున్నామని వివరించారు.

వాయుసేన అధిపతి సంచలన వ్యాఖ్యలు

రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ... డెలివరీలు మాత్రం మొదలుకావని వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

"చాలా సార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి.. కానీ, సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావడంలేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందుబాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు.. పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే.. దానిని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. మనం ఈ రోజు సంసిద్ధంగా ఉంటేనే.. భవిష్యత్తుకు సన్నద్ధం కాగలము. రానున్న పదేళ్లలో.. మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తాం" అని పేర్కొన్నారు. యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ఈ ఏడాది జనవరిలో కూడా వాయుసేనాధిపతి తేజస్ డెలివరీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

'ఆపరేషన్ సిందూర్' ముగియలేదు

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూదిల్లీ: ఉగ్రవాదం వ్యాప్తికి సహకరించే వారికి 'ఆపరేషన్ సిందూర్' తగిన సమాధానం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందని పేర్కొన్నారు. సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. హిమాలయ రాష్ట్రమైన సిక్కిం దేశానికి గర్వకారణమన్నారు. ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తారని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. 'గ్యాంగ్‌టక్ లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నేను నేరుగా పాల్గొనాలనుకున్నాను. అందుకు వాతావరణం సహకరించలేదు. సిక్కిం సాహస క్రీడలకు కేంద్రంగా మారే అవకాశం ఉంది. మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు కూడా ఈ దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని... రాష్ట్రంలో అనేక అభివృద్ధికారక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చీ జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగాచోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఈశాన్య రాష్ట్రాలపెట్టుబడుల సదస్సు గురించి మోదీ ప్రస్తావించారు. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దీంతో, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి భారత్ తగిన శాస్తి చేసిందని హెచ్చరించారు. పాక్‌పై ఇప్పటికే మూడుసార్లు వారి సొంతగడ్డపైనే దాడులు చేశామని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్దువార్‌లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. "ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి యావత్ దేశాన్ని కుదిపేసింది. బెంగాల్ అంతటా వ్యక్తమైన బాధ, ఆగ్రహాన్ని నేను అర్థం చేసుకోగలిగాను. మీ ఆగ్రహాన్ని నేను గ్రహించగలిగాను. ఉగ్రవాదులు మా సోదరీమణుల నుదుటి నుంచి సిందూరాన్ని తుడిచివేయడానికి ధైర్యం చేశారు. కానీ మన సైనికులు ఆ సిందూర్ శక్తిని వారికి చాటి చెప్పారు. ఈ బెంగాల్ భూమి నుంచి 140 కోట్ల మంది భారతీయుల తరపున 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని ప్రకటిస్తున్నాను. పాక్ సీమాంతర ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేశాం. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ప్రపంచానికి చేసింది ఏమీ లేదు. ఉగ్రవాదం, సామూహిక హత్యలు పాక్ ఆర్మీ రాటుదేలింది. బహిరంగ యుద్ధం జరిగినప్పుడల్లా పాక్ ఓటమిని ఎదుర్కొంటోంది. పాక్ ఉగ్రవాదం, హింసకు నిలయంగా ఉంది. ఉగ్రవాద చర్యలను భారత్ ఎప్పటికీ సహించదు" అని స్పష్టం చేశారు. అలాగే బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముర్షిదాబాద్, మాల్దాలో జరిగిన హింసను టీఎంసీ సర్కార్ క్రూరత్వం, ఉదాసీనతకు చిహ్నంగా అభివర్ణించారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఆరోపించారు. దేశంలోని ప్రతి పౌరుడు వికసిత్ భారత్, అభివృద్ధి చెందిన, సంపన్న భారత్?ను సాధించడం కోసం ఐక్యంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు. టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, గూండాలు స్వేచ్ఛగా తిరగడానికి వీలు కల్పించిందని మండిపడ్డారు.

కీచకుడికి శిక్ష తప్పదు: సుప్రీం

న్యూదిల్లీ: మద్యం సేవించి మృగంగా మారి సొంత బిడ్డనే చెరిచిన వ్యక్తికి శిక్ష నుంచి విముక్తి ఎలా కల్పిస్తామని సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. శిక్ష రద్దు చేయాలంటూ దోషి పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టివేసింది. తన ఏడేళ్ల కుమార్తెను మద్యం మత్తులో లైంగికంగా వేధించిన కార్డియాలజిస్ట్ తరపు వాదనను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. పాప తప్పుడు సాక్ష్యం చెప్పిందని, శిక్ష రద్దు చేయాలని అతని తరపు న్యాయవాది కోరగా కోర్టు మండిపడింది. ట్రయిల్ కోర్టు విధించిన శిక్ష నుంచి విముక్తి కల్పించబోమని తేల్చిచెప్పింది. 'పాపను ఏం చేశాడో చూడండి. ఇతనికి శిక్ష నుంచి ఉపశమనం కల్పించాలా' అని ప్రశ్నించింది. 'మీ క్లయింట్‌కు వ్యతిరేకంగా పాప వాంగ్మూలం ఇచ్చింది. అతను దుర్మార్గుడు. అతనికి ఉపశమనం పొందే అర్హత లేదు' అని మౌఖికంగా పేర్కొంది. 'మద్యం తాగితే మనిషి మృగంగా మారతాడు. వాస్తవానికి మేము ఇలా అనరాదు కానీ మాది అత్యంత ఉదార ధర్మాసనం. మేము ఇతనికి బెయిల్ ఇవ్వడం లేదంటే అందుకు కారణాలు ఉన్నాయి. చిన్న పాప విచారణను ఎదుర్కొన్నది.. తండ్రికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చింది. అబద్ధపు సాక్ష్యం ఎందుకు చెబుతుంది? సొంత బిడ్డతో ఎవరైనా ఇంత దారుణంగా ప్రవర్తిస్తారా? అని వైద్యుడి తరపు న్యాయవాది వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. అలహాబాద్ హైకోర్టులో 12 లక్షలకుపైగా కేసులు పెండింగ్ ఉన్నాయని, ఈ కేసు ఇప్పుడప్పుడే విచారణకు రాలేదని న్యాయవాది చెప్పగా... అలాగని శిక్ష రద్దు చేయాలా అని ధర్మాసనం చీవాట్లు పెట్టింది. దీంతో ఆ న్యాయవాది పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. 2018, మార్చి 23న కుమార్తెను హల్ద్వానీకి తీసుకెళ్లిన వైద్యుడు ఆమెను లైంగికంగా వేధించాడు. ఆపై మే 30న భార్యకు ఫోన్ చేసి పాపను తీసుకెళ్లమన్నాడు. తల్లికి జరిగిన ఉదంతం గురించి పాప చెప్పడంతో ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాప తల్లి వారణాసిలో, తండ్రి హల్ద్వానీలో ఉంటూ నర్సింగ్ హోం నడుపుతున్నాడు. ఈ కేసులో దర్యాప్తు క్రమంలో అతడు దోషిగా తేలాడు. దీంతో శిక్ష పడింది. అతను సుప్రీంకు వెళ్లగా... ట్రయిల్ కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది.

యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

చెన్నై: యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల బైక్‌పై పాకిస్థాన్ టూర్‌కు వెళ్లిన సన్నీ యాదవ్‌ను చెన్నై విమానాశ్రయంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్ ప్రయాణ వివరాలను సేకరిస్తున్నారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో యూ ట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్, అంతర్జాతీయ బైక్ రైడర్ బయ్యా సన్నీ యాదవ్‌పై సూర్యాపేట జిల్లా పోలీసులు లుక్‌ఔట్ ఉత్తర్వులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల విషయంలో ఈ ఏడాది మార్చి ఐదో తేదీన సూర్యాపేట జిల్లా నూతనకల్ పోలీసు స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది. విచారణలో భాగంగా సన్నీ యాదవ్ విదేశాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సన్నీ యాదవ్ వాఘా సరిహద్దు గుండా పాకిస్థాన్ దేశంలోకి వెళ్లినట్లు పోలీసులు అనుమానించారు. బైక్‌పై పాకిస్థాన్ ప్రయాణం పూర్తి చేసినట్లు ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సన్నీ యాదవ్ తిరిగి ఇండియాకు రాగా చెన్నై ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్టు చేశారు.

అమర్‌నాథ్ యాత్రకు భారీ బందోబస్తు

న్యూదిల్లీ: అమర్‌నాథ్ యాత్ర జూలై మూడు నుంచి ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు జరగనుంది. కేంద్ర హోంశాఖ నిర్ణయం మేరకు జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర సాయుధ పోలీసు దళాలకు (సీఏపీఎఫ్) చెందిన సుమారు 580 కంపెనీల సిబ్బందిని మోహరించనున్నారు. సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది అమర్‌నాథ్ వెళ్లే దారుల్లో విధులను నిర్వర్తించనున్నారు. ఇప్పటికే 424 కంపెనీల బలగాలను పంపించారు. ఇక మిగితా 80 కంపెనీల దళాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో అక్కడకు పంపారు. వాళ్లను కూడా వివిధ లొకేషన్లకు మార్చుతున్నట్లు చెప్పారు. అమర్‌నాథ్ యాత్రికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తున్నట్లు కేంద్ర బలగాలు పేర్కొన్నాయి. తక్షణమే కేంద్ర బలగాలు జమ్మూకశ్మీర్‌లో పొజిషన్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం, గందేర్‌బల్ జిల్లాలోని బల్తాల్ మార్గాల్లో భద్రత పటిష్టం చేస్తున్నారు. సీఏపీఎఫ్‌కు చెందిన అయిదు కంపెనీల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ ఉన్నాయి. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ ఇప్పటికే అమర్‌నాథ్ యాత్రపై సమీక్షించారు. బీఎస్ఎఫ్ డీజీ దల్జిత్ సింగ్ చౌదరీ కూడా త్వరలో సమీక్షించనున్నారు.

ఆ భవనాలు కూల్చేయండి

డీకే శివకుమార్ ఆదేశాలు

బెంగళూరు: వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ, వరదలకు కారణమవుతున్న భవనాలను కూల్చివేయాలని బెంగళూరు మున్సిపల్ అధికారులకు కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం ఆదేశాలిచ్చారు. ఇటీవల వర్షాలతో జలమయమైన ప్రాంతాల్లో పర్యటించారు. బెంగళూరు అభివృద్ధి శాఖ బాధ్యుడిగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కోరుకుంటున్నట్లు విలేకరులతో మాట్లాడిన ఆయన చెప్పారు. మాన్యతా టెక్ పార్కు సమీపంలో వరదకు దారితీ సిన డ్రెయిన్లు పరిశీలించారు. 'వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సీఎం, నేను పర్యటించాం. ఇది ప్రధాన కూడలి. ఇక్కడ నుంచి మొదలైన సమస్య అనేక ప్రాంతాలకు విస్తరిం చింది. కొందరు వ్యక్తులు ఇప్పటికే కోర్టుల నుంచి స్టే తెచ్చుకున్నారు. మున్సిపల్ అధికారులు కొందరు సహకరించడం లేదు.అందుకోసమే విపత్తు నివారణ చట్టం కింద సమస్యగా ఉన్న భవనాల తొలగింపునకు ఆదేశించా' అని శివకుమార్ వెల్లడించారు. నీటి ప్రవాహానికి అడ్డు ఉండకూడదనే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వరదల కారణంగా బెంగళూరు ప్రతిష్ఠకు భంగం కలగరాదని, అందుకు సంబంధిత భూయజమానులు సహకరించాలని డీకే శివ కోరారు. సాంకేతిక కారణాల వల్ల తప్పు జరిగితే పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. అందరి అంగీకారంతో ముందుకెళుతున్నట్లు వెల్లడించారు. ఆక్రమణల తొలగింపు బాధ్యతలను బృహత్ బెంగళూరు మహానగర పాలికా ప్రధాన కమిషనర్ ఎం.మహేశ్వరరావుకు అప్పగించినట్లు డీకే శివకుమార్ చెప్పారు.

పాక్‌కు గూఢచర్యం...

ప్రభుత్వ ఉద్యోగి అరెస్ట్

న్యూదిల్లీ: భారత్‌లో విస్తరించిన పాకిస్థాన్ గూఢచర్యం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. తాజాగా రాజస్థాన్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పాక్ నిఘా సంస్థ కోసం పనిచేస్తున్నారన్న ఆరోపణలపై అరెస్టయ్యాడు. రాష్ట్ర ఉద్యోగ కల్పన కార్యాలయంలో పనిచేసే సకూర్ ఖాన్ మగలియార్‌ను సీఐడీ, ఇంటెలిజెన్స్ బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. అతడు గతంలో ఓ మంత్రికి వ్యక్తిగత సహాయకుడిగా కూడా పనిచేయడం సంచలనంగా మారింది. పాక్ సరిహద్దుల్లోని జైసల్మేర్ జిల్లా బరోడా గ్రామంలోని మంగళియార్ ధాని ఇతడి స్వస్థలం. ఆ మాజీ మంత్రిది కూడా ఇదే గ్రామం కావడం గమనార్హం. సకూర్‌ఖాన్‌పై గత కొన్ని వారాలుగా దర్యాప్తు బృందాలు నిఘా పెట్టాయి. అతడికి పాక్ దౌత్య కార్యాలయంతో సంబంధాలపై కూడా ఆరాతీశాయి. 'సకూర్ అనుమానాస్పద కార్యకలాపాల గురించి ఉన్నత స్థాయి నుంచి సమాచారం అందింది. దీంతో వాటిని ప్రశ్నించి... నిర్ధారించుకొనేందుకు అరెస్ట్ చేశాము' అని ఎస్పీ సుధీర్ చౌధ్రీ వెల్లడించారు. అతడి మొబైల్‌లో కొన్ని పాకిస్థానీ నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి గురించి సరైన సమాధానం అతడి నుంచి రావడం లేదని దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి. పాక్‌ను ఏడుసార్లు సందర్శించినట్లు అతడు అంగీకరించాడు. ఇప్పటివరకు అతడి ఫోన్‌లో ఎటువంటి మిలిటరీ సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. అయితే కొన్ని ఫైల్స్‌ను అతడు తొలగించినట్లు గుర్తించారు. అతడి రెండు బ్యాంకు ఖాతాలపై దృష్టిసారించారు.

ఆప్‌లో చేరిన పారిశ్రామికవేత్త నితిన్ కోహ్లీ

చండీగఢ్: పంజాబ్‌కు చెందిన పారిశ్రామికవేత్త నితిన్ కోహ్లీ గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో చేరారు. పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియా సమక్షంలో ఆయన ఆప్ కండువా కప్పుకున్నారు. దీంతో జలంధర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం హల్కా ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే రమన్ అరోనా సానాన్ని భర్తీ చేశారు. ఈ మేరకు సిసోడియా ప్రకటించారు. అవినీతి ఆరోపణలతో అరోరా గతవారం అరెస్టు కావడాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలను ఎమ్మెల్యే మోసం చేయడం బాధాకరమని సిసోడియా వ్యాఖ్యానించారు. కోహ్లీ రాకతో తమ పార్టీకి మరింత బలం చేకూరిందని, ఆప్‌లోకి ఆయనను స్వాగతించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

అదనపు తరగతి గదుల నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజ్ భవన్‌లో అదనంగా పిల్లలకు అవకాశం కల్పించేందుకు పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజ్ భవన్, ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాల ఆలియాలను సందర్శించి పాఠశాలలోని ల్యాబ్, డైనింగ్ హాల్, కొత్తగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ఆయన పరిశీలించారు. రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పిల్లలు ఎక్కడెక్కడ నుండి నుండి వస్తున్నారని, ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని, పాఠశాలకు ఏమైనా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరం ఉందా అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్ భవన్, ఆలియా మోడల్ స్కూల్ పాఠశాలలకు మంచి పేరు ఉన్నందున ఈ పాఠశాలల్లో చదవాలని చాలామంది విద్యార్థులు వస్తున్నందున, అదనంగా విద్యార్థులకు, చుట్టుపక్కల పాఠశాలల్లోని పిల్లలకు కూడ ఈ పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు గాను అదనపు తరగతి గదులు నిర్మాణాలపై ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. మంచి ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు ఉన్నందున ఈ పాఠశాలలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ పాఠశాలల్లో అదనంగా విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు గాను అదనపు తరగతి గదులు నిర్మించుటకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, డిప్యూటీ ఈఓ బి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐఓఎస్ జివి గుప్తా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ఆర్ సుజాత, కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నందున వెంటనే స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ చివరన లేదా జూలై మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు, ముందుగా ఎంపీటీసీ జెడ్పీటీసీ ఆ తర్వాత సర్పంచ్ అనంతరం మున్సిపాలిటీ ఎన్నికలు ఆగస్టు 15 లోపు పూర్తి చేసే విధంగా జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభలలో బీసీ రిజర్వేషన్ బిల్లులు ఆమోదించి కేంద్రానికి పంపిస్తేనే సరిపోయిందా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా అందుకు అనుగుణంగా యుద్ధ ప్రాతిపదిక తగిన చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే చాలా ఆలస్యం అయినందున ఇక ఎంత మాత్రం వాయిదా వేయకుండా బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వారిని ఇబ్బందుల పాలు చేసిందన్నారు. బిల్లులురాక అప్పుల పాలై ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి బాధలు వర్ణణాతీతమన్నారు. సుమారు 2000 కోట్లకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాలా పూడికతీత పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలా పూడిక తీత పనులను డివిజన్ కార్పొరేటర్ సునీత రాము యాదవ్ గురువారం పర్యవేక్షించారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి 27 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ ఆమె తెలిపారు. హనుమాన్ పేట్, జ్యోతి నగర్ ప్రాంతాలలో నాలాలలో పేరుకుపోయిన కూడికతీత పనులను ఆమె సర్కిల్ ఏ.ఈ.ఈ దివ్య జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాళాలలో పేరుకుపోయిన వ్యర్థాలతోపాటు కూడికతీతను సకాలంలో తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లిపోవడానికి అధికారులు సిబ్బంది చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, సిద్ధి రాములు, మర్రి శీను, వాసుదేవరావు, హబీబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మేడ్చల్ జిల్లా నూతన కార్యదర్శి ఉమా మహేష్‌కు అభినందనలు

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : నూతనంగా ఎన్నికైన మేడ్చల్ జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఉమా మహేష్‌ను క్రాంతి కళాబృందం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. క్రాంతి కళాబృందం అధ్యక్షుడు వి.వెంకటాచారి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు శ్రేణులంతా కంకణ భద్దులు కావాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యదర్శి ఉమామహేష్‌ను శాలువాతో సన్మానిస్తూ చిన్న జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కళాబృందం సభ్యులు జంగిడి శ్రీనివాస్, మంగళంపల్లి తిరుపతి, రుద్రవెల్లి బబ్లు చారి, కుత్బుల్లాపూర్ సిపిఐ నాయకులు రాములు, హరినాథరావు, ఎమ్మెస్ రెడ్డి, సహదేవ రెడ్డి, జానకిరామ్, ఇమామ్ మహమూద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తమవ్వాలి

కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్త పరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ... బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి. సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్ ఏర్పాటుపై కృతజ్ఞతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్‌ను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సురవరం జయంతి అధికారిక నిర్వహణకు కృషి చేస్తా

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సామాజికవేత్త, కవి, రచయిత, ప్రముఖ సంపాదకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు బాషా కోవిదులు, గ్రంథాలయాల అభివృద్ధికి తపించిన సురవరం ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి దశాబ్దం క్రితమే తెలంగాణ గళం గట్టిగా వినిపించారని, అన్ని సామాజిక వర్గాలలో చైతన్యాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. అంతటి మహనీయుని పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని చిన్నారెడ్డి తెలిపారు. సురవరం గొప్ప పరిశోధకులు అని, సొంతంగా 11 వేల పుస్తకాలు సేకరించి భావి తరాల కోసం రెడ్డి హాస్టల్ లైబ్రరీలో భద్ర పర్చారని చిన్నారెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానంద రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, ప్రముఖ సాహితీ విమర్శకులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఏనుగు నర్సింహా రెడ్డి, సురవరం కృష్ణ వర్ధన్ రెడ్డి, నిర్వాహకులు బడే సాబ్, మనోహర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సరోజినీ దేవి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను చిన్నారెడ్డి ఆవిష్కరించారు.

31న ఛలో ఇందిరా పార్క్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్ జిల్లా నాయకులు మన్నన్, మాజిద్ గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ చట్టానికి సవరణ చేస్తూ కార్పోరేట్లకు లక్షలాది ఎకరాల భూములను కట్టబెట్టడం కోసం చట్ట సవరణ చేయడం జరిగింది. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ముస్లిం సంఘాలు ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సెమినార్లు నిర్వహించటం జరిగింది. వక్ఫ్ బోర్డులో గతంలో ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉండేది కానీ ఇప్పుడు ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డు మెంబర్లుగా చేర్చడం అంటేనే దీని వెనకాల పెద్ద కుట్ర ఉన్న అనే విషయం అర్థం అవుతున్నది గతంలో ఎవరైతే వక్ఫ్ స్థలాలను ఆక్రమించుకున్నరో వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడం కోసం ఈ చట్ట సవరణ చేశారు.

గతంలో వక్ఫ్ భూములను ఆక్రమించుకున్న వారిపైన నాన్ బెయిల్ సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యేది. కానీ చట్ట సవరణ తర్వాత భూఆక్రమణదారులకు బెయిల్ వచ్చే విధంగా సవరణ చేయటము అత్యంత దుర్మార్గం. గతంలో భూఆక్రమణదారులకు రెండు సంవత్సరాలు శిక్ష విధించే అవకాశం ఉంటే ఈ చట్ట సవరణ తర్వాత కేవలం ఆరు నెలలు మాత్రమే శిక్షలు విధించే విధంగా సవరణ చేశారు. వక్ఫ్ బోర్డుకు ముస్లిం, ముస్లిమేతరులు వారి భూములను ఇవ్వాలంటే కచ్చితంగా వారు గత ఐదు సంవత్సరాలు ఆయా మతాలను కచ్చితంగా పాటిస్తున్నట్టు సర్టిఫికెట్లు సమర్పించాలని చెప్పటం దారుణం. ఈ విధంగా అక్రమంగా అన్యాయంగా ఒక మతానికి సంబంధించిన ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి జరుగుతున్న కుట్రలను ఎండగడుతూ జరిగే కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయగలరని విజ్ఞప్తి చేశారు.

జైహింద్ ర్యాలీకి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించబోయే జైహింద్ ర్యాలీ, బాచుపల్లిలోని సభకు ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని పి.వి.ఎన్ కాలనీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పిలుపు మేరకు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ ప్రజలకు మేలు చేసే విధంగా కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో పరిణయం సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యమూర్తి, నహీం ఖాన్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, బ్రహ్మయ్య, నాగేష్, శంకర్‌రావు, రోజా రమణి, కవిత, నరసింహారెడ్డి, చారి, రాము, ఉదయ్ కుమార్, మౌసిన్ తదితరులు పాల్గొన్నారు.

31న బిజినేపల్లిలో రిలే నిరాహార దీక్షను బీసీలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఈనెల 31 తేదీన శనివారం నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి జేఏసీ, బీసీ జన చైతన్య వేదిక, బీసీ కుల సంఘాలు ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరహార దీక్షను బీసీ కులాల ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీసీ జన చైతన్య వేదిక నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు చింతకుంట శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. రిలే నిరహార దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ బీసీ జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివార్చక విజయ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లిఖార్జున్, పూలే ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పచ్చిపాల సుబ్బయ్య, మండల్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ శంకర్ యాదవ్, సదానంద గౌడ్, రాజేందర్, బీసీ కుల సంఘాల నాయకులు హాజరవుతున్నారనీ తెలిపారు. రిలే నిరహారదీక్షను బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని చింతకుంట శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

క్రీడలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహం

తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపి మిథున్ రెడ్డి

హైదరాబాద్ హుస్సేన్ సాగర్ లేక్‌లో ప్రారంభమైన నేషనల్ రోయింగ్ పోటీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కీడలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రోత్సాహం అందిస్తున్నారని తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఢిల్లీ అధికార ప్రతినిధి (క్రీడల సలహాదారు) తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపి జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపి మిథున్ రెడ్డి, వీసీయండి సోనిబాల దేవి, వైస్ ప్రెసిడెంట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ రాజీలక్ష్మి సింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం క్రీడల పట్ల సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు, అండర్ 13,అండర్ 15 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాల్లో పోటీలలో 25 రాష్ట్రాలకు చెందిన 350 మంది రోయర్లు పాల్గొన్న టు అధ్యక్షులు రెడ్డి తెలిపారు.

కంపెనీ డాక్యుమెంట్లను బయటి వారికి ఇస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి సంస్థకు సంబంధించిన గోప్యనీయ సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు కంపెనీ ఉద్యోగులని, అధికారులని బెదిరిస్తున్నట్లు, ఒత్తిడికి గురి చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇటువంటివారు ఏ స్థాయిలో ఉన్న వారైనా లెక్క చేయాల్సిన అవసరం లేదని, కంపెనీకి సంబంధించిన సమాచారాన్ని, కానీ డాక్యుమెంట్లను కానీ ఇతరులెవ్వరికీ ఇవ్వకూడదని సంస్థ డైరెక్టర్ పి పి, పర్సనల్ గురువారం ఒక సర్క్యులర్ లో పేర్కొన్నారు. కీలకమైన శాఖల్లో ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని, గోప్యత పాటించాలని, బయటి వ్యక్తుల బెదిరింపులు లేదా ఒత్తిడులకు లోనై, కీలక సమాచారాలను, డాక్యుమెంట్లను ఇతరులకు అందజేయడం దుష్ప్రవర్తనగా భావించటం అవుతుందని హెచ్చరించారు. ఎవరి ప్రలోభాలకు, బెదిరింపులకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. గోప్యత గల సమాచారం కోసం డిమాండ్ చేస్తూ, ఒత్తిడి చేసే వ్యక్తుల సమాచారాన్ని యాజమాన్యానికి తెలియజేయాలని, ఈ విధంగా ఫిర్యాదు చేసే వారి సమాచారం బయటకు వెల్లడి కాకుండా కంపెనీ జాగ్రత్త వహిస్తుందని, బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక తర్వాత కూడా ఎవరైనా కంపెనీ యొక్క కీలకమైన, గోప్యనీయ సమాచారాన్ని బయటకు వెల్లడించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఆదేశించారు. అలాగే కంపెనీలో వివిధ కింది శాఖల నుండి పై శాఖల వారికి పంపించే నోట్ ఫైల్స్, ముఖ్యమైన పత్రాలను అత్యవసర సందర్భంలో కంపెనీ మెయిల్ ద్వారా పంపించవచ్చని, కానీ వాట్సాప్ ద్వారా మాత్రం పంపించకూడదని మరొక సర్క్యులర్‌లో డైరెక్టర్ పా హెచ్చరించారు. వాట్సప్ ద్వారా పంపిస్తున్న సమాచారం ఇతరులకు లీక్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని కంపెనీ నోట్ ఫైల్స్, సమాచార ఫైల్స్ పంపించడానికి వినియోగించవద్దని ఆయన ఆదేశించారు.

31న మట్టిమనిషి నాటక ప్రదర్శన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : మిత్ర క్రియేషన్స్ వారి మట్టిమనిషి నాటకాన్ని ఈనెల 31న ప్రదర్శించనున్నారు. డా. వాసిరెడ్డి సీతాదేవి రచించిన నవలా మూలం ఆధారంగా, వల్లూరు శివప్రసాద్ నాటక రచన చేయుగా, యస్.యం. బాషా దర్శకత్వం వహించనున్నారు. 50 మంది నటీనటులు ఈ నాటకంలో పాల్గొననున్నారు. మే 31 శనివారం, జూన్ 01 ఆదివారం సాయంత్రం 06:30 గంటలకు జోనల్ మున్సిపల్ ఆఫీస్, అలిండ్ ఎంప్లాయీస్ కాలనీ, శేరిలింగంపల్లిలో ప్రదర్శించనున్నారు. ఈ నాటకాన్ని వీక్షించేందుకు బుక్‌మై షో ద్వారా రూ.200 టికెట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 7702623536 , 9959777923 సంప్రదించవచ్చు.

భారత సైనికులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-దుండిగల్: భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుండి కెజిఆర్ కన్వెన్షన్ వరకు నిర్వహించిన జై హింద్ యాత్ర ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో పాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలిసి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ జై హింద్ యాత్ర ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌పై బిజెపి పార్టీ చేసిన నీచ రాజకీయ ధోరణి ప్రజలకు వివరించాలన్నారు. దేశ సరిహద్దులో, మన దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు యావత్ దేశం అండగా ఉంటుందని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సంఘీభావం వ్యక్తం చేశారు. ఏఐసీసీ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నియోజకవర్గల ఇంచార్జ్‌లు, ఛైర్మెన్‌లు, మహిళ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎల్ ఎస్ యు ఐ నాయకులు, సేవదల్ నాయకులు, బీసీ సెల్ సభ్యులు, ఎస్సి సెల్ సభ్యులు, మైనారిటీ సెల్ సభ్యులు, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ సాయి శివానికి అభినందన

విశాలాంధ్ర - హైదరాబాద్ : సివిల్స్‌లో ప్రతిభ కనబరిచి 11వ ర్యాంకు సాధించిన వరంగల్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివానిని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. తన తల్లిదండ్రులు రాజు, రజితతో కలిసి సాయి శివానిని ఆయన సత్కరించారు. సివిల్స్ ర్యాంకర్ సాయి శివాని మేనమామ ప్రకాశ్ రావు ఆర్టీసీలో డీఎం హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్‌ను కలిశారు. సాధారణ కుటుంబానికి చెందిన సాయిశివాని సివిల్స్‌లో చిన్న వయసులోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారని ఈ సందర్భంగా సజ్జనర్ కొనియాడారు. ఈ డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ ముట్టుకోకుండా, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా అనుకున్న లక్ష్యాన్ని ఆమె సాధించారని ప్రశంసించారు. టీజీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, సిరిసిల్ల డీఎం ప్రకాశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో కండక్టర్ కుమారుడి సత్తా.....

మొరాకోలో ఇటీవల జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో కూకట్‌పల్లి డిపోనకు చెందిన కండక్టర్ బానోత్ మోహన్ కుమారుడు అకీరా నందన్ సత్తా చాటాడు. 400 మీటర్ల పరుగు పందెంను 53.07 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచి.. స్వర్ణ పతకం సాధించాడు. 200 మీటర్ల పరుగులోనూ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో మెరిసిన కండక్టర్ కుమారుడు అకీరా నందన్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. హైదరాబాద్ బస్ భవన్‌లోని తన చాంబర్‌లో గురువారం అకీరా నందన్‌ను ఆయన సన్మానించారు. తన కుమారుడిని క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తోన్న కండక్టర్ మోహన్ దంపతులను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ రెక్టర్‌లు ముని శేఖర్, వెంకన్న, సీటీఎం (కమర్షియల్) శ్రీధర్, సీపీఎం ఉషాదేవి, కూకట్ పల్లి డీఎం హరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్కే విల్లాస్ కాలనీకి భగీరథ పైప్ లైన్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్ : ఎన్నో ఏళ్లుగా మిషన్ భగీరథ నీటి కోసం అనేక కష్టాలు పడుతున్న సీఎస్కే గ్రీన్ విల్లాస్ కాలనీవాసులకు ఇప్పుడు నీటి కష్టాలు తీరనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో చొరవతో గ్రీన్ విల్లాస్‌కు ఇప్పుడు మిషన్ భగీరథ పైప్లైన్ పనులు ప్రారంభం అయ్యాయి. స్థానిక కాంగ్రెస్ నేత జమ్రుద్ ఖాన్, మాజీ కౌన్సిలర్ శ్రావణి ఆధ్వర్యంలో సీఎస్కే గ్రీన్ విల్లాస్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ తదితర సభ్యులు మిషన్ భగీరథ పైప్ లైన్ పనులకు గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో అనేక సందర్భాల్లో తమ సమస్య చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ వచ్చాక తమ సమస్యలను తీర్చాలని తమ పాలిట అపర భగీరథుడు శంకరుడిలా మారాడని వారు కొనియాడారు. ఎమ్మెల్యే శంకర్ అదేవిధంగా ప్రభుత్వానికి సీఎస్కే గ్రీన్ విల్లాస్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సాదత్, శివరాం, సుధాకర్ రెడ్డి, రమేష్, బ్రహ్మారెడ్డి, షాకీబ్, బాలు, రాజా, ప్రభాకర్ రెడ్డి, అర్పత్, వహీబ్, మూర్తి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, శీను,నవాజ్, ఇష్తేకార్, చలమారెడ్డి, రాధాకృష్ణ, రవివర్మ, సికందర్, జావిద్, శేఖర్, సుధీర్ రెడ్డి, శ్రీరామ్, మూర్తిసింగ్, వరప్రసాద్, రమేష్‌బాబు, బాబన్‌సింగ్, పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఊరట

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ఊరాట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటూ ఏ1గా నిందితుడిగా గతంలో పోలీసులు అయన్ను చేర్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ నుండి తప్పించుకుని ప్రస్తుతం అయన అమెరికాలో ఉంటూ దేశానికి రాకుండా ఉండేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. కాని చివరకు కోర్టు జోక్యంతో అయన భారత్‌కు పంపేందుకు అమెరికా కూడా సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే తనకు ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని సుప్రీం కోర్టులో అయన ముందస్తు బోయిల్ చేశారు. దీంతో కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం అయనకు తాత్కాలిక ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే మూడు రోజుల్లో అయను భారతదేశానికి తిరిగి రావాలని కోర్టు అదేశించింది. గురువారం బెయిల్ పిటీషన్ పై జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విచారించి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాకర్ రావు భారత్ తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్‌పోర్ట్‌ను కూడా మంజూరు చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆయనపై ఎలాంటి కఠినమైన చర్యలు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. బెయిల్ ఇస్తే తాను ఇండియాకు తిరిగి వస్తానని గతంలోనే ప్రభాకర్ రావు తన కోర్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ప్రభాకర్ రావుకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో మే 9న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు జూన్ 20 లోపు కోర్టులో హాజరుకావాలని లేదంటే ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామంటూ నాంపల్లి కోర్టు ఇటీవల స్పష్టం చేసింది.

ఎస్టీపీలను ప్రారంభానికి సిద్ధం చేయండి

అధికారులను ఆదేశించిన ఎండీ అశోక్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్టీపీల పనుల్లో వేగం పెంచి తుదిదశలో ఉన్న వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. తొలుత అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చిన్న చిన్న సివిల్ వర్క్‌లు, గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణంలాంటి పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే సుందరీకరణ పనులను చేపట్టి ఎస్టీపీ ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించి నేలని చదును చేయాలని సూచించారు. అనంతరం అత్తాపూర్ ఎస్టీపీని సైతం సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించిన ఎండీ మిగిలిపోయిన పనుల్ని సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు, మందులకు ప్రతిపాదనలు పంపండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదు అని సింగరేణి వైద్య శాఖ పై ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్‌లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. ఆసుపత్రులను ఆధునికీకరిస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణిలో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలుచుకోవాలని సూచించారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు. కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ చేయవచ్చు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే సాంకేతికత ఉపయోగంలో ప్రథమ స్థానంలో ఉందని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. గురువారం ఆయన కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించిన తర్వాత జిల్లాల పోలీసు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. తదుపరి కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణ, ప్రాధాన్యమైన కేసులు, నేరాల పరిశీలన, ప్రజలకు అందించిన సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ప్రజెంటేషన్‌లో జిల్లాలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలు జిల్లా పోలీసులు ప్రదర్శించిన ప్రతిభలను ప్రస్తావించారు. డీజీపీ ప్రతి సర్కిల్ ఇన్స్పెక్టర్, సబ్ డివిసనల్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి వారి ఏరియాలో జరుగతున్న నేరాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ముఖ్యమైన కేసుల వివరాలు, వాటి పురోగతి నేరాల నివారణకు చేపట్టిన చర్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, పోలీసు శాఖ ప్రధాన లక్ష్యం ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం అని స్పష్టం చేశారు. ప్రజలలో వారు సురక్షితంగా ఉన్నాము అన్న భావన కలిగేలా పోలీసింగ్ జరగాలని ఆయన సూచించారు. ప్రజల అభిప్రాయాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండటం ద్వారా వారి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడమే కాకుండా నేరాలుకూడా తగ్గించవచ్చు అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హై వే అథారిటీ, రవాణా శాఖ వారితో సమన్వయం చేసుకుంటూ ప్రివెంటివ్ చర్యలు, ట్రాఫిక్ నియమాలపై, సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. ఏదైనా నేరం జరిగాక చర్యలు తీసుకునే కంటే జరుగక ముందే ముందస్తు సమాచారంతో నేరాలను ప్రివెంటివ్ చెయ్యాలని, తరచు ప్రాపర్టీ నేరాలకు పాల్పడే వారే మరలా నేరాలు చేస్తున్నారు. చంద్రశేఖర్ రెడ్డి మల్టీ జోన్-1 ఐజిపి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, డిఎస్‌పిలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో నిరుపేదల కల సాకారం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆమనగల్లు : పేదల ఆత్మగౌరవ ప్రతీక సొంతిల్లు అని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఇళ్లు లేని నిరుపేదల కల సాకారం అవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 14, 11వ వార్డులలో పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య అధ్వర్యంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మాజీ సర్పంచ్ గుర్రం కరుణ శ్రీ కేశవులు, ఆదివాసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కృష్ణ నాయక్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, అబ్దుల్ ఖాదర్, అప్పం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌ఈయూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శ్రీధర్ నాయక్, అబ్దుల్ కరీం, దేవరశెట్టి మహేష్, మెకానిక్ బాబా, రవి, కాలే మల్లయ్య, సుమన్, పర్వతాలు, శ్రీను నాయక్, రాజు, బద్ది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలు నాటాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : వన మహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టరు హాజరైనారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో వన మహోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ వర్షకాలం ముందుగానే మొదలైనందున ఈ సారి మొక్కలు నాటే కార్యక్రమం వన మహోత్సవం కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో వన మహోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు మొక్కలు నాటేందుకు సిద్దంగా ఉండాలని అందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళిక దిశగా వెళ్లాలని సూచించారు. జిల్లాలో 70.604 లక్షల వరకు మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలను విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ మొక్కలలో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి ప్రతిరోజు నీళ్లు అందించడం, ఎరువు వేయాలడం వంటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటేందుకు సరిపడా స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా TGFMIS వెబ్‌సైట్‌లో ప్రతిరోజు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా అటవీ శాఖాధికారి జానకిరాం, పర్యాటక శాఖాధికారి శ్రీధర్, ఆర్ అండ్ బిఈఈ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, హౌజింగ్ పిడిరమణ మూర్తి, హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి, అటవీ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఒలంపిక్స్‌లో పతకం సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఒలంపిక్స్‌లో పతాకం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, జిల్లా నుండి పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జవాజి సాయి వర్ధన్‌కు తెలిపారు. మే 4 నుండి 15 వరకు బీహార్ రాష్ట్రంలోని రాజగిరిలో నిర్వహించిన జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన జవాజి సాయి వర్ధన్ వెయిట్ లిఫ్టింగ్ 89 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన జవాజి సాయివర్ధన్ గురువారం జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. బంగారు పతకం సాధించినందుకు సాయి వర్ధన్‌కు అభినందనలు తెలిపి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాయి వర్ధన్ గతంలో హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించిన యూత్ నేషనల్ క్రీడా పోటీలలో వెయిట్ లిఫ్టింగ్ పాల్గొని కాంస్య పతాకం సాధించారని భవిష్యత్తులో ఒలంపిక్స్‌లో పతాకం సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి సుధాకర్, శిక్షకులు, తండ్రి శివకుమార్ అథ్లెట్ కోచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

విశాలాంధ్ర - ఘట్ కేసర్ : కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్కు తరలించడానికి ఆర్టిఓతో మాట్లాడి అదనపు వాహనాలు సమకూర్చుకోవాలని పాడి కాంట్రాక్టర్ను జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి గురువారం ఆదేశించారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్, అంకుషాపూర్లోని కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎల్.సుగుణ బాయితో కలసి సందర్శించి ధాన్యం, రవాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రైతులు తేమ, తాలు, మట్టిపెడ్డలు లేని నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన తేమ శాతం 17 లోపు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని, అకాల వర్షాల నుండి వరి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడానికి సంబంధిత శాఖ అధికారులు వాతావరణానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీల ద్వారా రైతులకు తెలియవర్చాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేయదానికి అవసరమైన టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ మీటర్లను తగు మొత్తంలో సమకూర్చుకోవాలని, తగినంత మంది హమాలీలను ఏర్పటు చేసుకొని ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ఆన్లైన్ చేయాలని, ధాన్యం అమ్మిన 48 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఘటకేసర్ మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈఓ జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండల రెవిన్యూ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - అమనగల్లు : రెవెన్యూ సమస్యలు సరైన సమయంలో పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గురువారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో ఫార్మా సిటీ (ఫ్యూచర్ సిటీ) ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో భాగంగా కడ్తాల్ మండల రెవెన్యూ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. రైతుల పట్టాదారు పాసుబుక్కులో పేరు, సర్వే నం, భూమి రకం, కులం మొదలగు వివరాలు తప్పుగా నమోదై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సరిచేసుకోవడానికి ధరణి/ భూ భారతి ద్వారా దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి సమస్యలు పరిష్కారం కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.కడ్తాల్ మండలంలోని రైతులు పలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు ధరణి/ భూభారతి ద్వారా ధరఖాస్తు చేసుకున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సత్తు వెంకటరమణ రెడ్డి, అంబయ్య యాదవ్, లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, రాజు నాయక్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జైహింద్ ర్యాలీకి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ నుండి జైహింద్ ర్యాలీ, బాచుపల్లిలోని సభకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు మోహన్ రాజు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మోహన్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం నందు భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన కిరణ్ కుమార్ తండ్రి కేదారి (41) ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారుడు కిరణ్ కుమార్‌కు 2.00 లక్షల రూపాయలను మంజూరు చేయించి ఆయన చేతుల మీదగా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసే వారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం, కార్మిక హక్కుల పరిరక్షణకు

ఉద్యమాలు ఉధృతం

- ప్రజాస్వామ్య లౌకికవాద రక్షణ కార్మికవర్గ కర్తవ్యం
- అతిజాతీయవాదంతో సామాజిక వివేకానికి ప్రమాదం
- జులై 9న సార్వత్రిక సమ్మె జయప్రదం
- ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్‌లో అమర్‌జిత్ కౌర్

(విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి డి.సోమసుందర్)

జైపూర్: రాజ్యాంగం, కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు ఉధృతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. బడా కార్పొరేట్‌లకు లాభాల కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తున్నదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాలు గురువారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ప్రారంభమయ్యాయి. ఇందిరా గాంధీ పంచాయత్ రాజ్ & గ్రామీణ్ వికాస్ సంస్థాన్ ఆడిటోరియంలో మూడు రోజులు జరిగే సమావేశాలకు ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. సీనియర్ కార్మిక నాయకుడు ఎంఎల్ యాదవ్ అరుణ పతాకాన్ని ఎగురవేయడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర గిరి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఏఐటీయూసీ రాజస్థాన్ ప్రధాన కార్యదర్శి కునాల్ రావత్ ప్రారంభోపన్యాసం చేశారు. గత సెప్టెంబరులో విశాఖపట్నంలో జరిగిన జనరల్ కౌన్సిల్ అనంతరం చోటుచేసుకున్న జాతీయ, అంతర్జాతీయ రాజకీయ-ఆర్థిక పరిణామాలు, ఏఐటీయూసీ కార్యకలాపాలపై అమర్‌జిత్ కౌర్ నివేదికను సమర్పించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్య పరిణామాలతో మే 20న జరగాల్సిన సర్వాత్రిక సమ్మె జులై 9వ తేదీకి వాయిదా వేయగా, దానిని విజయవంతం చేయాలన్నారు. దేశ సార్వభౌమత్వం, జాతీయ సమైక్యత అంశంపై కార్మికవర్గం తన బాధ్యతను ప్రకటించిందని అమర్‌జిత్ కౌర్ అన్నారు. జాతీయ సమైక్యతకు, సామాజిక సామరస్యానికి భంగం కలిగే ప్రసంగాలను బీజేపీ నేతలు చేస్తున్నారని, కల్నల్ సోఫియా ఖురేషిని సైతం మతం పేరుతో అవమానించారన్నారు. బీజేపీ ప్రభుత్వ అజెండాకు వ్యతిరేకంగా పోరాడటం, భారత ప్రజాస్వామ్య, లౌకికవాద రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కార్మికవర్గ కర్తవ్యమని అమర్‌జిత్ కౌర్ ఉద్ఘాటించారు. పహల్గాం ఉగ్రదాడికి దారితీసిన భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు ప్రచారాన్ని అధికార పక్షం, దాని అనుకూల వర్గాలు సాగించాయని దుయ్యబట్టారు. తప్పుడు కథనాలతో ప్రజలను యుద్ధ మానసిక స్థితిలోకి నెట్టారన్నారు. సామాజిక మాధ్యమాల్లో అతిజాతీయవాదం వికృతరూపం దాల్చి... సామాజిక వివేకాన్ని దెబ్బతీసే పరిస్థితి నెలకొందని అమర్‌జిత్ ఆగ్రహం వ్యక్తంచేశారు.దేశభక్తితో కాగిగోల చేసినా పఠాన్‌కోట్, పహల్గాం ఘటనలలో ప్రభుత్వ వైఫల్యంపై ప్రధాని సమాధానం చెప్పాల్సిందేనన్నారు. బీజేపీలో అంతర్గతంగా సమస్యలు వస్తుండటంతో బీహార్ ఎన్నికల ముందు పహల్గాం ఘటన జరగడం, భారత్ సైనిక చర్యలకు దిగడం సందేహాలకు తావిస్తున్నదని, దీని వెనుక కుట్ర ఉన్నదన్న అనుమానం వ్యక్తమైందని అమర్‌జిత్ కౌర్ వ్యాఖ్యానించారు. తాజా పరిణామాలతో ఉగ్రవాదంపై చర్చ అగ్రదేశాల ఆయుధ సామర్థ్యం వైపునకు మళ్లిందని, భారత్-పాక్ సరిహద్దు... అగ్రరాజ్యాల ఆయుధ పరీక్ష స్థలమైందన్నారు. సామ్రాజ్యవాద దేశాల చేతిలో కీలుబొమ్మగా మోదీ ప్రభుత్వం మారిందని అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. సైనిక చర్యల విరమణ నిర్ణయాన్ని ముందుగా ప్రకటించడంతో పాటు తానే యుద్ధాన్ని నివారించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించినా మోదీ ప్రభుత్వం మౌనం పాటించడం వల్ల భారత విదేశాంగ విధానం నవ్వులపాలైందన్నారు. పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ముస్లింలు, పండిట్లు, కశ్మీరీ సమాజం మొత్తం ఏకమైందని, ఈ సానుకూల అంశాన్ని విస్మరించి, పాకిస్థాన్‌తో యుద్ధం పేరుతో దేశంలో కాశ్మీర్, ముస్లింలపై విద్వేష ప్రచారాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ కొనసాగించడం సిగ్గుచేటన్నారు. విద్వేష ప్రచారాన్ని కార్మికవర్గం ముక్తకంఠంతో ఎదుర్కొంటుందని అమర్‌జిత్ కౌర్ అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులను ప్రస్తావిస్తూ పలస్తీనాకు మద్దతును ప్రకటించారు. భారత్ ఎప్పుడు పలస్తీనాకు అనుకూలం కాగా మోదీ హయాంలో ఇజ్రాయిల్ జాత్యహంకార నరమేధానికి మద్దతిచ్చే స్థాయికి దిగజారిందని ఆందోళన వ్యక్తంచేశారు. మతోన్మాదం, ఆధిపత్యవాదం, అతిజాతీయవాదం వంటివి తిరస్కరించాలని పిలుపునిచ్చారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ విధానాలపై చర్చ అవసరమన్నారు. అసంఘటిత కార్మికుల జీవన స్థితిగతుల మెరుగుదల, ఉద్యోగ కార్మిక వర్గాల డిమాండ్ల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేయాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ మాట్లాడుతూ తాజా పరిస్థితులకు అనుగుణంగా కార్మికవర్గ పోరాటాలు రూపొందించాలన్నారు. సరిహద్దులో పోరాడే సైనికులకు కార్మికవర్గం మద్దతు ఇస్తుందని తెలిపారు. మత ప్రాతిపదికపై ప్రజలను విభజించేందుకు పాలక వర్గాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎర్ర జెండాని భుజాన వేసుకుని పట్టుదలగా ముందుకుపోవడం అందరి కర్తవ్యమని రామేంద్ర కుమార్ అన్నారు. సమావేశంలో దేశం నలుమూలల నుంచి 270 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ జాతీయ నాయకులు సీహెచ్ వెంకటాచలం, శ్రీకుమార్, సుకుమార్ దామ్లే, వహీదా నిజాం, రామకృష్ణ పాండా హాజరయ్యారు.

ప్రభుత్వం కొనసాగితేనే రాష్ట్రాభివృద్ధి

ఏడాదిలోనే రూ.8.5లక్షల కోట్ల పెట్టుబడులు: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-కడప: కూటమి ప్రభుత్వం కొనసాగింపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. కట్టుబట్టలతో బయటకు వచ్చి 2014 నుండి 2019 వరకూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నాం. 2019లో ప్రభుత్వం మారడంవల్ల రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయి 30 ఏళ్లు వెనక్కి పోయింది. అదే 2019- 24 వరకూ మన ప్రభుత్వం కొనసాగి ఉంటే ఎటువంటి అభివృద్ధి జరిగేదో ఒక్కసారి ప్రజలంతా ఆలోచించాలని కోరారు. కడప మహానాడు వేదికపై లోకేశ్ సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు. గుజరాత్‌లో బీజేపీ వరుసగా 7 సార్లు గెలిచి ఒకే ప్రభుత్వం కొనసాగడం వలన ఆ రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందిందో చూడండి. ఒడిశాలో బిజూ జనతాదళ్ వరుసగా ఐదు సార్లు గెలిచింది. ఆ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి చెందింది. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ చంద్రబాబు నేతృత్వంలో వరుసగా రెండుసార్లు విజయం సాధించాక ఎంతటి అభివృద్ధి సాధించిందో మీకందరికీ తెలుసు. అందుకే ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యమని, దీని గురించి రాష్ట్రవ్యాప్త చర్చ జరగాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కొనసాగింపు ఉంటే పెట్టుబడి పెట్టే వారికి నమ్మకం ఉంటుంది. మన యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కేవలం ఏడాదిలోనే 8లక్షల 50వేల కోట్లు పెట్టుబడులు సాధించి ఆరున్నర లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకోవడమే కూటమి ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్నపూర్ణ లాంటి రాష్ట్రాన్ని అప్పులప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. కొత్త కంపెనీ రాకపోగా ఉన్న కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. అంతులేని ధనదాహంతో విషం కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఏరులై పారించి 30వేలమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు, వేలకోట్లు దోచుకొని రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వెళ్లిపోయారని లోకేశ్ ఆరోపించారు. కడప మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించిన ఆరు శాసనాలను పొలిట్ బ్యూరో సభ్యుడి నుంచి సామాన్య కార్యకర్త వరకు శ్వాసగా భావించి చిత్తశుద్ధితో అమలుకు కృషిచేయాలని లోకేశ్ కోరారు. రెడ్ బుక్ అంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలుచేయడమేనని అన్నారు. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో వారిని చట్ట ప్రకారం శిక్షిస్తాం అని చెప్పానని... ఇప్పుడు రెడ్ బుక్ అదే చేస్తోందన్నారు. అయితే గత పాలకులు చేసిన తప్పులు మనం చేయకూడదని, అనవసర వ్యాఖ్యానాలు, ఒక్క తప్పు మాట కూడా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులను కోరారు.

న్యాయ వ్యవస్థలో సంస్కరణలు... జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన

అన్ని పార్టీలకు సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ లేఖ

న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థలో సంస్కరణలు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన డిమాండ్‌కు మద్దతు కోరుతూ అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ ఒక లేఖ రాశారు. జస్టిస్ వర్మ ఇంట్లో గుట్టలుగా నగదు లభ్యమైన నేపథ్యంలో ఆయనపై అభిశంసనకు డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు రుజువైతే ప్రజలకు నమ్మకద్రోహం చేయడమే కాకుండా న్యాయ వ్యవస్థల సమగ్రతను అవమానించడమే అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. భారత న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను పరిరక్షించేందుకు రాజ్యాంగబద్ధంగా బాధ్యత తీసుకోవాలని అన్ని రాజకీయ పార్టీలను సంతోశ్ కుమార్ కోరారు. ఇటువంటి వ్యవహారాల్లో పార్లమెంటు నిర్ణయాత్మకంగా వ్యవహరించాలన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 124, 218లోని నిబంధనల ప్రకారం అభిశంసనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్టసభ మౌనప్రేక్షక పాత్ర పోషించరాదన్నారు. న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం, సమ్మిళిత, సామాజిక ప్రాతినిధ్యం పెంచడం కోసం జాతీయస్థాయిలో రాజకీయ చర్చ జరగాలని సంతోశ్ కుమార్ నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థలో నియామకాల్లో పారదర్శకత లోపించిందని, కులం, లింగం, ప్రాంతీయ వైవిధ్యతకు సముచిత ప్రాతినిధ్యం లేదన్నారు. 'భారతీయ సమాజం విభిన్న లక్షణాలను మన న్యాయస్థానాలు ప్రతిబింబించాలి. ఉన్నత న్యాయ వ్యవస్థల్లో జవాబుదారీ యంత్రాంగాలు కావాలి. నేడు మనముందున్న అవినీతి వ్యవహారం వ్యవస్థాగత సంస్కరణలు, ప్రజాస్వామిక సంకల్పం డిమాండ్ల సంస్థాగత వైఫల్యం పర్యవసానం' అని సంతోశ్ కుమార్ అన్నారు. సంస్థాగతంగా ప్రజాస్వామ్యబద్ధ జవాబుదారీతనాన్ని సీపీఐ నిలబెట్టిందని, న్యాయపరమైన ప్రవర్తనను, సమగ్రతను పర్యవేక్షించడానికి రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నదని తన లేఖలో సంతోశ్ కుమార్ పేర్కొన్నారు.

బుల్డోజర్ రాజకీయం ఆపండి

సుందరీకరణ పేరిట పేదల ఇళ్ల కూల్చివేతలు సహించం: నారాయణ

దిల్లీలో వామపక్షాల భారీ నిరసన

న్యూఢిల్లీ: సుందరీకరణ పేరుతో పేదలను వెలి వేస్తున్నారని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని, పేదలకు వారున్న చోటే ఆవాసాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దిల్లీలో ఝుగ్గి మురికివాడల్లో కూల్చివేతలు, మోదీ ప్రభుత్వ బుడ్డోజర్ విధానానికి వ్యతిరేకంగా దేశ రాజధానిలో వామపక్షాల అధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. నారాయణ ప్రసంగిస్తూ మోదీ ప్రభుత్వ విధానాలను ఆక్షేపించారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్న చోట్ల నగరాల సుందరీకరణ నెపంతో పేదల ఆవాసాల తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చారో అక్కడే వారికి ఇళ్లు కట్టివ్వాలని నారాయణ డిమాండ్ చేశారు. తమ కార్పొరేట్ మిత్రులకు అటవీ భూములు దారాదత్తం చేస్తున్నారని, ఇటువంటి బుల్డోజర్... కూల్చివేతల రాజకీయాన్ని సాగనివ్వబోమన్నారు. 'వారిని అడ్డుకుందాం... బుల్డోజర్లకు ఎదురెళ్లి ఆపుదాం' అని నారాయణ పిలుపునిచ్చారు. సీపీఐ దిల్లీ కార్యదర్శి దినేశ్ వార్ష్నే మాట్లాడుతూ పేదల గుడిసెలు కనిపిస్తాయి కానీ ధనికుల ఫాంహౌస్‌లు కనిపించవా అని పాలకుల తీరును దుయ్యబట్టారు. ఝుగ్గీ మురికివాడలను మాత్రమే ఎందుకు తొలగిస్తున్నారు... అక్రమంగా కట్టిన ఫాంహౌస్‌లు ఎందుకు కూల్చడంలేదంటూ ప్రశ్నించారు. దిల్లీ ఓ జోన్‌లో సెటిల్మెంట్ రాజకీయం కేవలం మురికవాడకే పరిమితమా? కామన్‌వెల్త్ విలేజ్ వంటి ధనికవాడలకు వర్తించదా అని దినేశ్ నిలదీశారు. నిరసనలో సీపీఎం సీనియర్ నేత బృందా కారత్, దిల్లీ శాఖ కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు సుచేత డే, ఆర్ఎస్‌పీ కార్యదర్శి శత్రుజిత్ సింగ్, సీజీపీఐ నేత బిర్జు నాయక్, సీపీఐ దిల్లీ కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌లాల్, అబ్బర్ అహ్మద్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు హరికృష్ణ, ఝుగ్గి నివాసీ సభ సంఘటన్ నేత కేహర్ సింగ్‌తో పాటు కూల్చివేతలు జరిగిన మద్రాసీ క్యాంపెయిన్, ధోబీఘాట్, బాట్లా హౌస్, బేలా ఎస్టేట్, సురక్షా మంచ్ తదితర బస్తీల నాయకులు పాల్గొన్నారు.

తెలుగు పాఠకులకు సుపరిచిత ఆఫ్రికా రచయిత

గూగీ వా థియాంగో మృతి



న్యూఢిల్లీ: తెలుగు పాఠకులకు సుపరిచితుడు, ఆఫ్రికా సాహిత్య దిగ్గజం గూగీ వా థియాంగో (87) మృతి చెందారు. ఆయన మరణించినట్లు కెన్యా అధ్యక్షుడు ప్రకటించారు. థియాంగో బుధవారం తుది శ్వాస విడిచినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఆధునిక ఆఫ్రికా సాహిత్యంలో తనదైన గుర్తింపు సాధించిన థియాంగో జైలులో ఉన్నప్పుడు టాయిలెట్‌లోని టిష్యూ పేపర్‌పై నవల రాశారు. తనదైన గుర్తింపు సాధించారు. జైలు, బహిష్కరణ, అనారోగ్యం వంటివి థియాంగో రాతలను ఆపలేకపోయాయి. కెన్యాకు చెందిన గూగీ వా థియాంగో తమ దేశం వలస పాలన నుంచి ప్రజాస్వామ్య దేశంగా మారే క్రమంపై అనేక రచనలు చేశారు. సాహిత్యంలో ఆయనకు నోబెల్ బహుమతి అందుతుందని ఆశపడ్డ అభిమానులకు ప్రతిసారీ నిరాశే ఎదురైంది. 'నోబెల్ రాకున్నా, నా రచనలు మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తున్నందుకు గర్వ పడుతుంటా' అని 2018లో బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో గూగీ వా థియాంగో అన్నారు. ఆయన రాసిన 'డెవిల్ ఆన్ ద క్రాస్' పుస్తకం తెలుగులో 'మట్టికాళ్ల మహారాక్షసి' పేరుతో అచ్చయింది. ఆ తర్వాత 'మాటిగరి', 'బందీ' పుస్తకాలు కూడా తెలుగులో వచ్చాయి. 'డ్రీమ్స్ ఇన్ ఎ టైమ్ ఆఫ్ వార్' అనే పుస్తకం 'యుద్ధకాలపు స్వప్నాలు' పేరుతో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా తెలుగులోకి అనువదించారు. నాగపూర్ జైలులో యావజ్జీవ ఖైదీగా ఉన్నప్పుడు ఆయన ఈ అనువాదం చేశారు. కెన్యా... బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు అంటే 1938లో వ్యవసాయ పనులు చేసే పేద కుటుంబంలో గూగీ వా థియాంగో జన్మించారు. ఆయన అసలు పేరు జేమ్స్ థియాంగో గూగీ.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళల మృతి

విశాలాంధ్ర - కొరిశపాడు: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం... అరుణాచలం వెళ్లేందుకు తెనాలి నుంచి ఓ కుటుంబం కారులో బయలు దేరింది. కారును కుమారుడు నడుపుతుండగా పక్కసీట్లో తల్లి కన్నెగంటి ఝాన్సీరాణి (60) కూర్చుంది. వెనుకసీట్లో అతడి పెద్దమ్మ, చిన్నమ్మ కూర్చున్నారు. జాతీయ రహదారిపై దూసుకుపోతున్న కారు మేదరమెట్ల వద్ద డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. కారు ముందు భాగంలో కూర్చున్న ఝాన్సీరాణి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. డ్రైవింగ్ చేస్తున్న కుమారుడు గాయపడి స్పృహ కోల్పోయాడు. వెనుకసీటులో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి అత్యవసర వాహనంలో క్షతగాత్రులను తరలిస్తుండగా వారిద్దరూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆర్టీఈ తొలి విడత ఉచిత సీట్ల ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ)లో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాల కోటా కింద తొలి విడత 23,117 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకుగాను మే 2 నుంచి 19 వరకు దరఖాస్తులు స్వీకరించగా... మొత్తం 37,427 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 28,882 మంది పాఠశాలలు ఎంచుకోగా... అందులో 28,561 మంది అర్హత సాధించారు. వారిలో తొలి విడతగా లాటరీ విధానంలో 23,117 మందికి సీట్లు ఖరారు చేశారు. ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత పాఠశాలలకు వెళ్లి... జూన్ 7లోగా ప్రవేశాలు నిర్ధారించుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. సీట్ల కేటాయింపు వివరాలను తల్లిదండ్రుల ఫోన్లకు నేరుగా పంపారు. ఎంపికైన విద్యార్థుల జిల్లా పేరు, మండలం, అప్లికేషన్ ఐడీ, పేరు, తండ్రి/సంరక్షకుల పేరు, స్కూల్ కోడ్, స్కూల్ జాబితా విడుదల చేశారు. రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి... రెండో విడతలో సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాలను జూన్ 18న ఖరారు చేస్తారు. తొలి విడత సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

బిష్ణోయ్ ముఠా సభ్యుడి కాల్చివేత

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ లో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన నవీన్ కుమార్ మరణించాడు. హాపూర్‌లో యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి బుధవారం రాత్రి నిందితుడిని హతమార్చారు. బిష్ణోయ్ గ్యాంగ్‌లో షార్ప్ షూటర్‌గా పేరొందిన నవీన్‌పై 20కి పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఒక పోలీసు కూడా గాయపడినట్లు పేర్కొన్నారు. తొలుత నవీన్ కుమార్ పోలీసులపై కాల్పులు జరిపి అడవుల్లోకి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో నవీన్ పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

బీసీలకు రూ.80 వేల సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లపై విజయానంద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ ఏడాది జూన్ చివరి నాటికి డిస్కామ్‌లు, నెడ్‌క్యాప్ కలిపి మొత్తం మూడు లక్షల సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఏర్పాటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సీఎండీలను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుండి గురువారం ఆయన డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్ ఇమ్మడి, పి.పుల్లారెడ్డి, కె.సంతోషరావు, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబుతో పాటు రాష్ట్రంలోని సీఈలు, ఎస్ఈలతో వీడియో సమావేశం ద్వారా ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం అమలు తీరుపై సమీక్షించారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలో ముందంజలో ఉంచడంలో విజయవంతంగా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలో 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వెనకబడిన తరగతుల కులాల వారికి (బీసీ) ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.20 వేలు కలిపి మొత్తం రూ.80 వేల సబ్సిడీ మంజూరవుతుందని, దీనివల్ల రూ.1.20 లక్షల సోలార్ రూఫ్‌టాప్ సిస్టంపై పెద్ద మొత్తంలో ప్రోత్సాహక సాయం లభిస్తుందన్నారు. ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తెలిసేలా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని సోలార్ రూఫ్‌టాప్ మోడల్ గ్రామంగా చేయాలన్నారు.

భవిష్యత్ డిజిటల్ మీడియాదే

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ :

భవిష్యత్ అంతా డిజిటల్ మీడియా జర్నలిజంపైనే ఆధారపడి ఉందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా పాత్రికేయ మిత్రులంతా నూతన విధానాలను అవలంభిస్తూ సమాజ శ్రేయస్సు కోసం నూతనాంశాలపై దృష్టి సారించాలన్నారు. ఎవరూ రాయని అంశాలపై దృష్టి కేంద్రీకరించి వార్తాకథనాలు రాస్తే డిజిటల్ మీడియా అయినా... ప్రింట్ మీడియా అయినా ఆయా వార్తలను పాఠకులు ఆసక్తిగా చదువుతారని, ఆ దిశగా మనం చైతన్యం కావాలని సూచించారు. తెలంగాణ మీడియా అకాడమీ అధ్వర్యంలో నల్లమల్ల ప్రాంతంలో జరుగుతున్న మొదటి రోజైన గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. దీనిలో భాగంగా 'తెలంగాణ జర్నలిజం గతం- వర్తమానం- భవిష్యత్తు మీడియా' అనే అంశంపై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కర్ణంలో ఏ వన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారని చెప్పారు. గతంలో ఒక విషయాన్ని తాము మెయిల్ వంటి దాన్ని తయారు చేయాలంటే సుమారు ఏడు గంటల సమయం పడుతుందని, కానీ ఏ వన్ టెక్నాలజీ ద్వారా ఒక గంటలోపే అది పూర్తి చేస్తుందన్నారు. నూతన డిజిటల్ ప్లాట్‌ఫాం ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తలు సామాజిక మాధ్యమా... డిజిటల్ మీడియానా అనే విషయానికొస్తే , వాస్తవాలు ఉండాలని, వార్తలను ప్రస్తుతం ...చేతిలో వైకుంఠం మాదిరిగా మొబైల్ ఫోన్లలో సమాజమంతా తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. ఆసక్తికరమైన వార్తలను వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ద్వారా సమాజానికి వాస్తవాలను చేకూరుస్తూ ప్రజలకు - ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమకే సాధ్యమైన (ఎక్స్‌క్లూజివ్) వార్తలు రాస్తే ప్రాధాన్యత పెరుగుతుందని ,ఆధునిక సాధనాలను అందిపుచ్చుకోవాలని, సాంప్రదాయక మీడియాపై ఇంకా ఆధారపడుతూనే ఉన్నామని చెప్పారు. సవాళ్లను ఎదుర్కొంటూ పరిగెత్తాల్సి ఉంటుందన్నారు. సంప్రదాయక పద్ధతులు పూర్తిగా నిర్వీర్యం అవుతున్నాయని, ఈ క్రమంలో కొన్ని పత్రికలు మూతపడుతున్న తరుణంలో నూతన డిజిటల్ విధానంలో పత్రికలు పరుగులు పెడుతున్నాయని గుర్తు చేశారు. 1925లో సురవరం ప్రతాపరెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన గోల్కొండ పత్రిక ద్వారా మొట్టమొదటి రాజకీయ సామాజిక పత్రిక నడిపించిన చరిత్ర ఉందన్నారు. గర్వించదగిన పత్రిక అంటే గోల్కొండ అని చెప్పొచ్చు అన్నారు. ప్రింట్ పేపర్ పై ఆసక్తి తగ్గిందని ఐదు నిమిషాలలో సమాచారం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి వెళుతుందని అలాంటి వార్తలు మించిన వాస్తవాలతో కూడిన వార్తలను మనం ప్రజల ముందు ఉంచితే యూట్యూబ్, ప్రింట్ మీడియా, డిజిటల్ మీడియా అని ప్రజలు ఆలోచించరని దేనికి దానికే ప్రాధాన్యత ఉంటుందన్నారు.

స్థానిక భాషకు అనుగుణంగా అక్షరమాలిక ఉండాలి: విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావ్

'భాష, తప్పొప్పులు, దిద్దుబాటు' అనే అంశంపై విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ మాట్లాడుతూ స్థానిక ప్రజల భాషకు అనుగుణంగా మన అక్షర మాలిక ఉండాలని అన్నారు. భాషా ప్రాథమికపై అనేకమంది రచనలు తీసుకొచ్చినప్పటికీ ప్రముఖ తెలుగు భాషా ప్రావీణ్యుడు గిడుగు రామ్మూర్తి రాసిన అద్భుతమైన భాష సమాజానికి సులువుగా అర్థమయ్యే విధంగా ఉందన్నారు. దానిని మనం అనుకరిస్తూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో వార్తలను అందించాల్సి ఉంటుందని వివరించారు. ఒక్కో ప్రాంతంలో ఒక రకమైన భాషా విధానం ఉంటుందని, దానికి అనుగుణంగా ఆ ప్రాంత ప్రజల సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉన్నప్పుడే వారికి అనుగుణంగా అర్థమయ్యేలా వార్తలు రాసే అవకాశం ఉంటుందని వివరించారు. ఆ దిశగా మనం చైతన్యం కావాల్సి ఉంటుందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.